స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

• పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు • భూసేకరణ, పునరావాస అంశాలపై విస్తృత చర్చ • రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం: మంత్రి ఉత్తమ్

2 లో..

యాదాద్రి భువనగిరి	సంపుటి: 2	సంచిక: 137	సోమవారం, అక్టోబర్ 5, 2026	ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి	పేజీలు: 12	వెల: 5-00
YADADRI BHUVANAGIRI	VOLUME : 2	ISSUE : 137	MONDAY, OCTOBAR 5, 2026	EDITOR : POLOJU SRINIVASA CHARY	PAGES : 12	RS : 5-00

HAPPY BIRTHDAY

OCTOBER

05

రమేష్ అన్న అడుగుల్లో అడుగులు వేస్తూ
సేవా ప్రయాణంలో తోడుగా నిలిచే చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్

మొగుదాల పావని రమేష్ గౌడ్

గారికి

జన్మదిన శుభాకాంక్షలు

సుర్కంటి బాలకృష్ణారెడ్డి

కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి ఎగ్జిగ్యూటివ్ మెంబర్,
మునుగోడు నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ సెక్రటరీ

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 137
సోమవారం
5 అక్టోబర్, 2026

సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

- పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు
- భూసేకరణ, పునరావాస అంశాలపై విస్తృత చర్చ
- రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనుల స్థితిగతులు, పూర్తి చేయాల్సిన లక్ష్యాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా అన్ని ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రధానంగా భూసేకరణ ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ఆలస్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రభావితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పునరావాసం, పునర్నిర్మాణ పరిహారానికి సంబంధించిన అంశాలు కూడా సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని నిబంధనల ప్రకారం వేగంగా అందించాలని, వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాలు కూడా సమానంగా పరిరక్షించబడాలని పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతులకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా సమీక్షించారు. వివిధ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు త్వరగా పొందేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని అధికారులకు సూచించారు. పరిపాలనా, సాంకేతిక అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలితాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు శంకర్ నాయక్, ప్రభుత్వ విప్‌లు, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.





నిర్మల్ జిల్లాలో మంత్రులు జూపల్లి, పొంగులేటి పర్యటన

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై సమీక్ష
- నిర్మల్‌లో రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్న జూపల్లి

హైదరాబాద్, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కలెక్టర్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అంతకుముందు నిర్మల్ జిల్లాలో రూ.23.35 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఐడీఓసీలో ప్రజల నుంచి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించనున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో జూపల్లి పర్యటన

మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం (అక్టోబరు 6) ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉట్నూర్ మండలం మత్తడిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, అక్కడ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. అనంతరం ఉట్నూర్‌లోని గోండు రాజుల కోటను సందర్శించి, ఆ ప్రాంత పర్యాటక అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత ఇంద్రవెల్లికి చేరుకుని మిస్ ఎర్త్ వాటర్ ఇండియా అవార్డు–2026 విజేత ప్రీతి ముండేను సన్మానించనున్నారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి అక్కడి వైద్య సేవలు, పరిస్థితులను పరిశీలిస్తారు. ప్రజా సేవా భవన్‌లో నిర్వహించే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. చివరగా డీసీసీ కార్యాలయంలో పార్టీ కార్యక్రమాలకు సంబంధించి నిర్వహించే సంక్షిప్త సమావేశానికి హాజరుకానున్నారు.

చింతన్ శివిర్‌లో పాల్గొననున్న మంత్రి కోమటిరెడ్డి

- నితిన్ గడ్కరీతో తెలంగాణ కీలక ప్రాజెక్టులపై చర్చలు
- పీఎం గతిశక్తి, కేంద్రం–రాష్ట్రం సమన్వయంపై రెండు రోజుల పాటు మేధోమథనం

హైదరాబాద్, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన సోమ, మంగళవారాల్లో (5, 6 తేదీల్లో) నిర్వహించనున్న రెండు రోజుల 'చింతన్ శివిర్–2026' వర్క్‌షాప్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారుల బృందంతో కలిసి పాల్గొననున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్లు, భవనాల శాఖ మంత్రులకు ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. మంత్రి వెంట రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, చీఫ్ ఇంజినీర్లు బి.వి.రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్‌తో పాటు పలువురు అధికారులు హాజరుకానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి వడోదరకు బయలుదేరనున్న మంత్రి బృందం, సాయంత్రానికి ఏక్తానగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణానికి చేరుకోనుంది. సోమవారం ఉదయం 6.30 గంటల నుంచి చింతన్ శివిర్ కార్యక్రమాలు ప్రారంభం కానుండగా, రెండు రోజుల పాటు ఐదు విడతలుగా చర్చలు జరగనున్నాయి. పీఎం గతిశక్తి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం వంటి అంశాలపై ప్రధానంగా మేధోమథనం చేయనున్నారు.




తెలంగాణ ప్రాజెక్టులపై ప్రత్యేక చర్చలు

చింతన్ శివిర్ సందర్భంగా తెలంగాణలోని పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా చర్చించనున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారి–65 విస్తరణ, ఎల్బీనగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇతర జాతీయ రహదారి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. రాష్ట్రంలో కీలక ప్రాజెక్టుల నిర్మాణం, వాటి సాధనకు కేంద్ర సహకారం పొందే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, మంత్రి కలిసి పలు కీలక ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, సంబంధిత అంశాలపై చర్చించారు.

పదేళ్ల పండుగకు సన్నాహాలు

- సిద్దిపేట జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా చాటేలా వేడుకలు
- 3రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం
- అన్ని వర్గాల భాగస్వామ్యంతో వేడుకలకు రూపకల్పన
- మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):

సిద్దిపేట జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా పదేళ్ల పండుగను నిర్వహించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమం, ఆకాంక్షలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలని హరీశ్ రావు అన్నారు. 1983 నుంచే సిద్దిపేట జిల్లా డిమాండ్ ప్రజల్లో బలంగా ఉన్నప్పటికీ అది చాలా కాలం నినాదంగానే మిగిలిపోయిందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2016 అక్టోబర్ 11న సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించారని అన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా ప్రజలకు పరిపాలన మరింత చేరువైందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుకు ముందు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, వ్యాపారులు, విద్యార్థులు వివిధ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. జిల్లా ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌకర్యాలు విస్తరించడంతో పాటు అభివృద్ధి వేగవంతమైందని చెప్పారు. గోదావరి జలాలు, రైల్వే సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి ఎన్నో అంశాలు సిద్దిపేట ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని వివరించారు. సిద్దిపేట జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని హరీశ్ రావు అన్నారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధి, సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్ రూపొందించాలని సూచించారు. అలాగే నాటి సిద్దిపేట, నేటి సిద్దిపేట అనే అంశంపై సమగ్ర డాక్యుమెంటరీ రూపొందించాలని ప్రతిపాదించారు. జిల్లా ఏర్పాటుతో వచ్చిన మార్పులను యువతకు పరిచయం చేయడం అవసరమని పేర్కొన్నారు. అక్టోబర్ 11న జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక సభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక, సాహిత్య, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జర్నలిస్టులు, కవులు, రచయితలు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తల ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి, సాధించిన ఫలితాలపై చర్చా వేదికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ సూడా చైర్మన్ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండు భూపేష్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టు, రచయిత, వైద్య, న్యాయవాది, వ్యాపార, విశ్రాంత ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేట పదేళ్ల పండుగను ప్రజల పండుగగా మార్చి జిల్లా ఘనతను దేశానికి చాటాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు.





సాబర్ డెయిరీతో పాడి రైతులకు మరింత ఊతం

- తూప్రాన్‌లో రూ.400 కోట్లతో మెగా ఇంటిగ్రేటెడ్ డెయిరీ ప్లాంట్
- 10 వేల మంది రైతులకు ప్రయోజనం
- 350 మందికి ప్రత్యక్ష ఉపాధి
- భూమిపూజలో మంత్రి శ్రీధర్‌బాబు


హైదరాబాద్, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

సాబర్ డెయిరీ మెగా ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ ఏర్పాటుతో తెలంగాణలో పాడి రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఊర్జా ఇండస్ట్రియల్ పార్క్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న సాబర్ (అమూల్) డెయిరీ ప్లాంట్‌కు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర డెయిరీ ప్రాసెసింగ్ రంగంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రారంభ దశలో ఈ ప్లాంట్ రోజుకు 5 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఏర్పాటు కానుందని మంత్రి తెలిపారు. దీని ద్వారా ప్రత్యక్షంగా సుమారు 350 మందికి ఉపాధి లభించడంతో పాటు, పాల సేకరణ, డెయిరీ అనుబంధ విలువ గొలుసు ద్వారా దాదాపు 10వేల మంది పాడి రైతులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. సాబర్ డెయిరీ 2015లో తెలంగాణలో పాల కార్యకలాపాలను ప్రారంభించిందని, ప్రస్తుతం రాష్ట్రంలోని రైతుల నుంచి రోజుకు లక్ష లీటర్లకు పైగా పాలను సేకరిస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. కొత్త ప్లాంట్‌లో పాలు, పెరుగు, పనీర్, ఐస్‌క్రీమ్, లస్సీ, నెయ్యి, మజ్జిగతో పాటు బేకరీ ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల రైతులు ఉత్పత్తి చేసే పాలకు అదనపు విలువ చేకూరి, మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రైతులు, వ్యవస్థీకృత పాల సేకరణ, ఆధునిక ప్రాసెసింగ్ వ్యవస్థ, వినియోగదారుల మధ్య అనుసంధానాన్ని ఈ ప్రాజెక్టు మరింత బలోపేతం చేస్తుందని మంత్రి అన్నారు. పాల సేకరణ నుంచి రవాణా, ప్రాసెసింగ్, శీతలీకరణ, ప్యాకేజింగ్, పంపిణీ, చిల్లర విక్రయాలు, అనుబంధ సేవల వరకు సమగ్ర డెయిరీ వ్యవస్థ అభివృద్ధికి అవకాశం కలుగుతుందని వివరించారు. సహకార డెయిరీ విధానంలో వినియోగదారుడు చెల్లించే మొత్తంలో గణనీయమైన వాటా పాల ఉత్పత్తిదారులకు చేరుతుందని శ్రీధర్‌బాబు తెలిపారు. అమూల్ రైతు కేంద్రిత నమూనాలో వినియోగదారుడు ఖర్చు చేసే ప్రతి రూపాయిలో సుమారు 80 శాతం వరకు పాల ఉత్పత్తిదారులకు అందుతుందని పేర్కొన్నారు. ఈ విధానం రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు డెయిరీ రంగాన్ని బలోపేతం చేయగలదని అన్నారు. నాణ్యమైన డెయిరీ ఉత్పత్తులు, ముఖ్యంగా పనీర్ వంటి ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి రావడం ప్రయోజనకరమని మంత్రి అభిప్రాయపడ్డారు. విశ్వసనీయమైన సహకార సంస్థ ద్వారా నాణ్యమైన అసలైన పాల ఉత్పత్తులు లభించడం వినియోగదారుల నమ్మకాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ', 'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో పెట్టుబడిదారుల విశ్వాసం పెరుగుతోందనడానికి ఈ ప్రాజెక్టు నిదర్శనమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 'సహకార సే సమృద్ధి', 'వైట్ రివల్యూషన్ 2.0'లో భాగంగా డెయిరీ సహకార వ్యవస్థలను బలోపేతం చేయడం, రైతులకు మార్కెట్ అవకాశాలను విస్తరించడం కీలకమని అన్నారు. వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఉపాధి, రైతు ఆధారిత విలువ గొలుసులను బలోపేతం చేసే పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం నిరంతరం సహకరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణను విస్తరణకు వేదికగా ఎంచుకున్న సాబర్ డెయిరీ, అమూల్ సంస్థలకు అభినందనలు తెలిపారు. పాడి రైతుల అభివృద్ధి, నాణ్యమైన ఉత్పత్తుల అందుబాటు, ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడుల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఓటమి భయంతో రాజ్యాంగ వ్యవస్థలపై విషప్రచారం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):



వరుస ఎన్నికల్లో ఎదురవుతున్న పరాజయాలను తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ ప్రజాతీర్పును అవమానిస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. ఎన్నికల ప్రక్రియతో పాటు రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసగా మూడు పర్యాయాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించి, నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా ఎన్నుకోవడాన్ని ఆ పార్టీ నాయకత్వం జీర్ణించుకోలేకపోతోందని రాంచందర్‌రావు అన్నారు. ప్రధాని పదవి ఒక కుటుంబానికే పరిమితమనే భావనతో ఉన్న కాంగ్రెస్ నాయకులు, సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తి దేశ ప్రధానిగా విజయవంతంగా పాలన సాగించడాన్ని ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ బూటకమని, వాటిని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును వినియోగించుకున్న కోట్లాది మంది ప్రజలను అవమానించడమేనని విమర్శించారు. రాహుల్ గాంధీ, ప్రకాష్ రాజ్ వంటి వారు సుప్రీంకోర్టు, రాష్ట్రపతి కార్యాలయం, భారత ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



రంగారెడ్డి

తెలంగాణకు కేసీఆర్ శ్రీరామ రక్ష



మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..

- చేవెళ్లలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం..

- పట్టభద్రుల ఓటరు నమోదుపై నేతల దృష్టి పెట్టాలి..

మొయినాబాద్ మున్సిపాలిటీ సెప్టెంబర్ 04 (వార్తా వేదిక సూర్య)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణపై చేవెళ్ల నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పీపీ కన్వెన్షన్‌లో జరిగిన సమావేశానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో ముందంజలో ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ నాయకత్వం అవసరమని ఆమె అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నాగేందర్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి,కొత్త నరసింహారెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, కోట్ల నరోత్తం రెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, ముదిగొండ రవి యాదవ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, లీగల్ సెల్ అధ్యక్షుడు సురేందర్ గౌడ్, బద్దుల సుధాకర్ యాదవ్, మోహన్ రెడ్డి, కొంతం నాగేశ్వర్ రెడ్డి, సలీం ఖాన్, జల్లెల మల్లేష్ యాదవ్, వడ్ల కాళిదాస్ చారి తదితరులు ఉన్నారు



గిరిజన బిడ్డల భవిష్యత్తుతో చెలగాటమా?

- పదేళ్లుగా మరమ్మతులు లేని హాస్టల్.. ఫ్యాన్లు లేక ఉక్కపోత.. తలుపుల్లేని మరుగుదొడ్లు

-విద్యార్థుల కష్టాలు కనిపించడం లేదా? నెలకోసారి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేయాలి

రాజేంద్రనగర్, అక్టోంబర్ 04 (వార్త వేదిక సూర్య) :



పేదరికాన్ని జయించి చదువుతో జీవితాన్ని మార్చుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వ వసతి గృహంలో ఉంటున్న గిరిజన విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాజేంద్రనగర్ సర్కిల్ హనుమాన్ నగర్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం దుస్థితిపై కామన్ ప్లాట్‌ఫామ్ తీవ్రంగా స్పందించింది. హాస్టల్ భవనానికి దాదాపు పదేళ్లుగా సరైన మరమ్మతులు చేపట్టలేదని, గోడలు పెచ్చులూడి బీటలు వారిన స్థితిలో ఉన్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులు నివసించే గదుల్లో సరిపడా ఫ్యాన్లు లేక ఉక్కపోతను ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. హాస్టల్ ప్రాంగణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు నిలిచి పోతుండటంతో దోమలు, ఈగలు పెరిగే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లకు సరైన తలుపులు లేకపోవడం, పైపులు పాడైపోవడం, పారిశుద్ధ్య లోపాలు ఉండటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, మంచి వాతావరణం అందాల్సిన చోట సమస్యలతో పోరాడే పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు.

"నేటి గిరిజన విద్యార్థులే రేపటి సమాజానికి బలమైన పౌరులు. వారి కలలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ హాస్టల్ అంటే కేవలం భవనం కాదు.. పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఆశాకిరణం" అని కామన్ ప్లాట్‌ఫామ్ ప్రతినిధులు అన్నారు.జిల్లా కలెక్టర్ నెలకు కనీసం ఒక్కసారైనా హాస్టల్‌ను స్వయంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయాలని, భవనానికి తక్షణమే పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టాలని కోరారు.పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులకు సమగ్ర వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు.విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే వారి సంక్షేమం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తామని కామన్ ప్లాట్‌ఫామ్ హెచ్చరించింది."గిరిజన బిడ్డ చదువు ఆగకూడదు.. వారి కలలు ఆరిపోకూడదు.. వారి భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలవాలి" అని పిలుపునిచ్చింది.



అంబానగర్‌లో చెట్టు బొంత పురుగుల సమస్యపై స్పందించిన బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్

సికింద్రాబాద్, అక్టోబర్ 04(వార్త వేదిక సూర్య)

అంబానగర్‌లో చెట్టు బొంత పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు బస్తీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న బౌద్ధనగర్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్ అంబానగర్ అధ్యక్షులు కొండ కిషోర్ గౌడ్ అక్కడికి చేరుకొని సమస్యను గోపాల్ దృష్టికి తీసుకెళ్లారు జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతకింది యాక స్వామి, పిల్లి వెంకటేష్, జక్కా జగన్మోహన్ దాస్, బొడిగె భిక్షపతి, పిల్లి సత్తెమ్మ, శ్రీనివాస్ గౌడ్, పిల్లి లింగం తదితరులు పాల్గొన్నారు.

మదర్ డైరీ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డికి హరీష్‌రావు అభినందనలు

ఆలేరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన దొంతిరి సోమిరెడ్డి ఇటీవల జరిగిన మదర్ డైరీ ఎన్నికల్లో డైరెక్టర్‌గా అఖండ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును సోమిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మదర్ డైరీ డైరెక్టర్‌గా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపి, రైతులు, పాడి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ మదర్ డైరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ నాయకులు సిరిగిరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావంతో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక

సికింద్రాబాద్, అక్టోబర్ 04(వార్త వేదిక సూర్య)





సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా భారతీయ జనతా పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా సీనియర్ సిటిజన్ సెల్ కన్వీనర్ శ్రీ బి.ఎల్. రామకృష్ణ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. నాలా బజార్ ప్రభుత్వ పాఠశాలతో పాటు రెజిమెంటల్ బజార్ సెట్ బస్వర్లాల్ ప్రభుత్వ పాఠశాలలోని హాస్టల్ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి సీనియర్ సిటిజన్ సెల్ కన్వీనర్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్, మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక ముఖ్య అతిథిలుగా హాజరై విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ..విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు టోపీ శంకర్, మన్మోహన్ సింగ్ ఠాగూర్, సత్యనారాయణ, నర్సింగ్ రావు, వినోద్, కొమురయ్య, ఇంద్ర సింగ్, విశ్వనాథ్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండువ భరద్వాజ్ జన్మదిన వేడుకల్లో అన్నదానం



60 మంది దివ్యాంగులకు అన్నప్రసాద వితరణ

రాజేంద్రనగర్, అక్టోంబర్ 04 (వార్త వేదిక సూర్య) :

ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన సేవగా భావిస్తారని, ముఖ్యంగా తమ ఆహార అవసరాలను స్వయంగా సమకూర్చుకోలేని దివ్యాంగులకు అన్నప్రసాదం అందించడం మానవ సేవే మాధవ సేవకు నిదర్శనమని మండువ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.మండువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండువ భరద్వాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వనస్థలిపురంలోని శాంతినికేతన్ వికలాంగుల ఆశ్రమంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని 60 మంది మానసిక దివ్యాంగులకు అన్నప్రసాదాన్ని అందించారు.

ఈ సందర్భంగా ట్రస్టీ మండువ మధుసూదన్ శర్మ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పుట్టినరోజులు, వివాహ వేడుకలు వంటి శుభకార్యాలను దివ్యాంగుల ఆశ్రమాల్లో నిర్వహించి, వారికి అన్నదానం చేయడంతో పాటు అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు దివ్యాంగుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు సమాజంలో మానవత్వాన్ని మరింత పెంపొందిస్తాయని తెలిపారు.



తరాలు మారినా.. యుగాలు గడిచినా ఇంద్రారెడ్డి అమరులే



- ప్రజానేత ఇంద్రారెడ్డి 72వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

రాజేంద్రనగర్, అక్టోంబర్ 04 (వార్త వేదిక సూర్య) :

ప్రజల కోసం పుట్టిన నాయకుడిగా, పేద ప్రజలకు అండగా నిలిచిన పోరాట యోధుడిగా పేరొందిన దివంగత నేత టైగర్ పట్లోళ్ల ఇంద్రారెడ్డి 72వ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఘనంగా నివాళులు అర్పించారు.

కౌకుంట్లలోని ఇంద్రారెడ్డి ఘాట్ వద్ద రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ నివాళులు అర్పించారు.ఇంద్రారెడ్డి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కౌకుంట్లలోని ఇంద్రారెడ్డి ఘాట్ వద్ద సమాధికి పుష్పగుచ్ఛం సమర్పించి, చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జయంతి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ తరాలు మారినా.. యుగాలు గడిచినా ఇంద్రారెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని అన్నారు. మరపురాని ప్రజానేతగా, పేదల పక్షాన నిలిచిన పోరాట యోధుడిగా ఆయన సేవలను కొనియాడారు. ప్రజల కోసం, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలినాళ్లలోనే 'జై తెలంగాణ' నినాదంతో ఉద్యమించిన ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీ యమన్నారు. ఇంద్రారెడ్డి చూపిన మార్గం తమకు ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన కర్తవ్యబద్ధతను కొనసాగించడం తమ బాధ్యత అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ ఇన్‌చార్జి కొలన్ సుభాష్ రెడ్డి, సీనియర్ నాయకులు డి. రమేష్ ముదిరాజు, జె. చిత్తారి, కొత్త రాజశేఖర్ రెడ్డి, పచ్చ శ్రీనివాసులు, జీవన్ దాస్, డాక్టర్ సాబ్, పోరెడ్డి ధర్మారెడ్డి, కె. దయానంద్, ఎ. సూర్యం, నోముల రాము యాదవ్, సదాల వెంకట్ రెడ్డి, ఉస్కెమూరి నిరంజన్ నేత, మైసి రెడ్డి, రావుల జంగయ్య, అక్కెమ్ రఘు యాదవ్, ఎం. నరేష్ యాదవ్, అరుణా రెడ్డి, సరిత మహేష్, బద్దం శ్రీకాంత్ రెడ్డి, నవీన్ కుమార్, సీనిల్ కుమార్, సదాల శ్రీనివాస్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, ఇంద్రన్న అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓబీసీ సభకు భారీగా తరలివచ్చిన అగ్రనేతలు

గొల్లపల్లిలో సందడిగా మారిన సభా ప్రాంగణం..

-నేతలకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రాజేంద్రనగర్, అక్టోంబర్ 04 (వార్త వేదిక సూర్య) :



ఓబీసీ జాతీయ కులగణనను లక్ష్యంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ శంషాబాద్ పరిధిలోని గొల్లపల్లిలో సందడిగా కొనసాగింది. సభకు రాష్ట్రానికి చెందిన పలువురు అగ్రనేతలు, ప్రజాప్రతినిధులు, ఓబీసీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ నేతలు వి. హనుమంతరావు, మధు యాష్కి, ఎంపీ మల్లు రవి తదితరులు సభకు హాజరయ్యారు. సభా ప్రాంగణానికి చేరుకున్న నాయకులకు ఓబీసీ చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన స్వాగతం పలికారు.

ఓబీసీ జాతీయ కులగణన, సామాజిక న్యాయం లక్ష్యంగా నిర్వహించిన సభకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావడంతో గొల్లపల్లి సభా ప్రాంగణం జన సందోహంతో కిక్కిరిసింది. అగ్రనేతల రాకతో సభా వేదిక వద్ద సందడి నెలకొంది. సభా ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంతో శోభాయమానంగా కనిపించింది.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 137
సోమవారం
05 అక్టోబర్ 2026



విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడి గా- పసునూరి నరేంద్ర చారి

దేవరకొండ, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):-



కొండమల్లేపల్లి మండల విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో పసునూరి నరేంద్ర చారి ఘన విజయం సాధించారు. అలాగే సంఘం ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్ చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

కొండమల్లేపల్లి మండలంలోని వీరభ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా మనమయ సంఘం ఉపాధ్యక్షులు సొనగంటి గోవర్ధన చారి, అధ్యక్షులు సల్లోజు శ్రీనివాస చారి ఐ ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి నారోజు సైదాచారి, గౌరవ అధ్యక్షులు కర్నెకంటి జంగాచారి, మాజీ అధ్యక్షులు పసునూరి శేఖర్ చారి, చెన్నయ్య చారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి

ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన అధ్యక్షుడిగా పసునూరి నరేంద్ర చారిని, ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్ చారిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సంఘం సభ్యులు అభినందించారు. సంఘం అభివృద్ధికి, కార్పెంటర్ వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు

దళిత మహిళపై దాడి ఘటనను తీవ్రంగా ఖండించిన చింతకుంట్ల అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్



దేవరకొండ అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):-

దాడికిపలుపడ్డ వ్యక్తిపై చట్టపరంగా కఠిన చర్య తీసుకోవాలి

నల్గొండ జిల్లా చింతపల్లి మండలం , కేంద్రంలోని పీకే మల్లేపల్లి గ్రామంలో వివో ఏ సంఘాలకు సంబంధించిన డబ్బుల వ్యవహారంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఓ దళిత మహిళపై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలను

ఈ ఘటనలో పీకే మల్లేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త వరికుప్పల అమర్నాథ్ గౌడ్ , గనీపల్లి మాధవి. పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయని ఒక దళిత మహిళపై బహిరంగంగా చేయి చేసుకుని దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం జరిగింది దీనిపై ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు "పద్మ అవార్డు గ్రహీత శ్రీ గౌరవ "మంద కృష్ణ మాదిగ ఆదేశాల ప్రకారం ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది అతనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ ఆరోపణలు నిజం అని తెలితే అతని పై చట్ట ప్రకారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ కేసు నమోదు చేసి అతని పైన చట్ట ప్రకారం శిక్షించ వలసింది గా దళిత సంఘాలు మొత్తం డిమాండ్ చేయడం జరిగింది దీనిపై చట్టం నిర్లక్ష్యం చేసిన యెడల చట్ట ప్రకారంగా ఎదురుకోవడానికి దళిత సంఘాలు సిద్ధం గా వున్నారు ఆయన అన్నారు లేనిపక్షంలో మాదిగలంతా ఏకమై వారి ఇంటి ముందు మాదిగ దండోరా నిర్వహిస్తామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు

నిండు కుండలా నీడనిచ్చిన వేపచెట్టు నేలకూల్చివేత





- అధికారుల తీరుపై స్థానికుల ఆవేదన

ఆలేరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):

ప్రకృతి ప్రసాదించిన నీరు, వృక్షాలు, జంతుజాతులను మానవ అవసరాల పేరుతో విచక్షణారహితంగా ధ్వంసం చేయడం వల్లే ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణ సమస్యలు తీవ్రతరమవుతున్నాయని సామాజిక కవి పత్తిపాటి మంజుల పేర్కొన్నారు. కవులు, రచయితలు, నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రకృతి ప్రేమికులు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా పర్యావరణ పరిరక్షణపై నిర్లక్ష్యం చేయడం అందోళనకరమన్నారు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్‌స్టేషన్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వెనుక వైపు, విద్యుత్‌శాఖ కార్యాలయానికి సమీపంలో ఉన్న పెద్ద వేపచెట్టును ఆదివారం ఉదయం నరికివేయడం స్థానికుల్లో ఆవేదన కలిగించింది. భవనాలు, ఇతర నిర్మాణాలు లేని ప్రాంతంలో పాదచారులకు నీడ, ఆశ్రయం కల్పిస్తూ ఎంతోకాలంగా ఉన్న వేపచెట్టును తొలగించడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ తీగలకు ఇబ్బంది కలుగుతున్న చెట్లను అవసరమైన మేరకు ట్రిమ్మింగ్ చేయాల్సిన చోట పూర్తిగా నరికివేయడం సరికాదని వారు పేర్కొన్నారు.

చెట్లను తొలగించే ముందు సంబంధిత శాఖల అనుమతులు, పర్యావరణ నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆలేరు మున్సిపల్, అటవీ, పోలీస్ శాఖల అధికారులు ఈ ఘటనపై పరిశీలన చేసి, పర్యావరణ పరిరక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ కమిటీ ప్రతినిధులు, స్థానికులు కోరారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, బాధ్యులపై నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "చెట్లను కాపాడటం అంటే మనిషి శ్వాసను కాపాడటమే. అభివృద్ధి పేరుతో ప్రకృతిని ధ్వంసం చేయకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి శాఖ బాధ్యతగా వ్యవహరించాలి" అని స్థానికులు కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అటకెక్కించింది



-రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

-- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):-



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అటకెక్కించిందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు.శనివారం రాత్రి దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో డిండి మండలం నగరదుబ్బ తండాకు చెందిన 20 మంది యువకులు కాంగ్రెస్ పార్టీ నుంచి దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, నేడు అనేక ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ కోతలు, ట్రిప్పులు, తక్కువ వోల్టేజ్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు మోటార్లను పంచుకుని నీళ్లు పారించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతుబంధు పథకాన్ని కొనసాగించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు విషయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. రైతు బీమా విషయంలోనూ రైతులకు భరోసా తగ్గిందని అన్నారు.కేసీఆర్ హయాంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేవని, నేడు యూరియా కోసం రైతులు క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. డీఏపీ ధరల విషయంలోనూ రైతులపై భారం పెరిగిందని అన్నారు.కరెంట్ రాకపోయినా, నీళ్లు అందకపోయినా ఎల్‌ఆర్‌ఎస్ వంటి కారణాలను చూపుతూ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. కృష్ణా నదిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మోటార్లను పూర్తిస్థాయిలో నడపడం లేదని ఆరోపించారు. ఏఎంఆర్, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుల విషయంలోనూ ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాజెక్టులకు నీరు అందుతున్న సమయంలో తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. నల్గొండ జిల్లాలోని యాదాద్రి పవర్ ప్లాంట్‌తో పాటు ఇతర విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకపోవడంతో వారి చదువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు.కేసీఆర్ ప్రభుత్వం హయాంలో కంటి వెలుగు, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు, దళిత బంధు, గొర్రెల పంపిణీ వంటి పథకాలు అమలు చేశామని, ప్రస్తుతం అనేక సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. కళ్యాణలక్ష్మి చెక్కులు కూడా లబ్ధిదారులకు సకాలంలో అందడం లేదని పేర్కొన్నారు.

తెలంగాణలో నేడు పంటలు పండుతున్నాయంటే గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన చెరువులు, చెక్‌డ్యామ్‌లు, సాగునీటి మౌలిక వసతులే కారణమని రవీంద్ర కుమార్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్దకు వెళ్లి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టాలని అన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు, పెన్షన్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాల కంటే మెరుగైన పథకాలను అమలు చేసి చూపించాలని, లేకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి పాత రోజులు తెస్తామని చెప్పారని, ప్రస్తుతం ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడే పరిస్థితి, విద్యుత్ కోసం ఎదురుచూసే పరిస్థితి తిరిగి వచ్చిందని విమర్శించారు.ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని, ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీల సాధన కోసం అలుపెరగని పోరాటం కొనసాగిస్తామని రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్ రావు, సర్పంచ్ మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొనుగోటి రవీందర్ రావు,తదితరులు పాల్గొన్నారు

నల్లగొండ





దళిత మహిళపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరకొండ అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):-



గాంధీ జయంతి రోజు నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో దళిత మహిళలు అయినటువంటి గనిపల్లి మాధవి పై ఆ గ్రామం మాజీ సర్పంచ్ అమర్నాథ్ గౌడ్ దాడి చేసి దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించినందుకుగాను ఆదివారం రోజు బాధిత మహిళలను కొండమల్లేపల్లి పట్టణ అధ్యక్షుడు అందుగుల నాగరాజు మాదిగ, గుడిపల్లి మండలం అధ్యక్షుడు ఎర్ర కిరణ్ మాదిగ పీఏపల్లి మండల అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అందుగుల జానయ్య మాదిగ వసుకుల శ్రీను మాదిగ వస్కుల బాలకృష్ణ మాదిగ కలిసి ఆమెకు మనోధైర్యాన్ని ఇచ్చారు ఈ విషయంపై మన్యశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశానుసారం నిందితుడని వెంటనే అరెస్టు చేయకుంటే పెద్ద ఎత్తున ధర్నా రాస్తారోలకు పిలుపునిస్తామని హెచ్చరించారు

చెక్ పవర్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి

దేవరకొండ అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):-

పరస్పర సహకారంతో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి



చెక్ పవర్‌కు సంబంధించిన అంశంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాము. నిర్దిష్ట కాలపరిమితిలో సమస్యకు పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమైన చర్యగా భావిస్తున్నాము

ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మిత్రులకు కూడా ఒక విజ్ఞప్తి చేస్తున్నాము. సర్పంచ్--ఉపసర్పంచ్‌ల మధ్య ఏర్పడే సమస్యలను కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న వ్యక్తిగత సమస్యగా చూడకూడదు. ఇది గ్రామ పరిపాలనతో పాటు మొత్తం పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అంశం అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.

గ్రామ అభివృద్ధి సజావుగా కొనసాగాలంటే సర్పంచ్, ఉపసర్పంచ్ ఇద్దరూ పరస్పరం సహకరించుకోవడం ఎంతో అవసరం. అధికారాలు, బాధ్యతలు, విధుల విషయంలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని ఘర్షణకు దారితీయకుండా చట్టపరమైన విధానాల్లో, పరస్పర చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలి

భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా సర్పంచులు, ఉపసర్పంచులు పరస్పర గౌరవంతో వ్యవహరించి గ్రామ ప్రజల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాము.

సర్పంచ్--ఉపసర్పంచ్‌ల మధ్య సమన్వయం ఉంటేనే గ్రామ పాలన బలోపేతమవుతుంది.

గ్రామ పాలన బలోపేతమైతేనే పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది

అందువల్ల ప్రతి సర్పంచ్, ప్రతి ఉపసర్పంచ్ వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి గ్రామ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పరం సహకరించుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాము

దివ్య చక్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

300 మందికి పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ

నాంపల్లి అక్టోబర్ 4(వార్త వేదిక సూర్య)



నల్గొండ జిల్లా నాంపల్లి మండలం దివ్య చక్ర చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ చైతన్యపురిలోని 'శ్రీహిత హాస్పిటల్' సౌజన్యంతో నాంపల్లి మండలం మెల్లవాయి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు సిహెచ్. వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో మెల్లవాయి మరియు పరిసర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 300 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ ఈఎన్టీ అండ్ జనరల్ సర్జన్ డాక్టర్ శివప్రసాద్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీకాంత్ (వీణ) లు రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి, వారి ఆరోగ్య సమస్యలపై తగిన సలహాలు, సూచనలు అందించారు. పేద, సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సమాజ సేవే ధ్యేయంగా ఇప్పటికే 60కి పైగా ఉచిత వైద్య శిబిరాలు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

?ఈ కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ కొండల్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీధర్, దేవేందర్‌తో పాటు వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.



నాగర్‌కర్నూల్



దసరా, బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి - ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట అక్టోబర్ 04:(వార్త వేదిక సూర్య)

దసరా, బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ సంతోషకరమైన వాతావరణంలో, పరస్పర సహకారంతో, శాంతియుతంగా జరుపుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు, యువత తప్పనిసరిగా పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.

ప్రజలు, ఉత్సవ కమిటీలకు ముఖ్య సూచనలు:

ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, అందరూ కలిసిమెలిసి ఆనందంగా జరుపుకోవాలి. ఎలాంటి గొడవలు, ఘర్షణలకు తావివ్వకూడదు. పెద్ద శబ్దాలు వచ్చే డీజేలు ఏర్పాటు చేయరాదు. తక్కువ శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్ మాత్రమే వినియోగించాలి. లక్కీ డ్రాలు, అనుమతి లేని ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదు. రోడ్లపై ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించకూడదు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించరాదు. దుర్గామాత మండపాల నిర్వాహకులకు సూచనలు: మండపం ఏర్పాటుకు ముందు సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి రోడ్లపై మండపాలు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలిగించరాదు. విగ్రహాల తరలింపు సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన విద్యుత్ పరికరాలు, సురక్షిత వైరింగ్ మాత్రమే ఉపయోగించాలి. మండపాల వద్ద సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలి. కమిటీ సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టాలి. బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా: మహిళలను గౌరవిస్తూ వారికి తగిన సౌకర్యాలు, భద్రత కల్పించాలి. బతుకమ్మలను సంప్రదాయ పూలతోనే తయారు చేయాలి. రంగులు, రసాయనాలు పూసిన పూలను నీటిలో వేయకుండా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి. నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు, భద్రతా చర్యలు పాటించాలి. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి: వర్షాభావ పరిస్థితులు, నీటి వనరులపై ఒత్తిడి దృష్ట్యా నీటిని, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలి. పండుగల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. "పండుగ మనందరిది – ఆనందం, ఐక్యత, భద్రత మన బాధ్యత" దసరా, బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా, సంప్రదాయబద్ధంగా జరిగేలా ప్రజలు, యువత, ఉత్సవ కమిటీలు జిల్లా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ కోరారు.

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దు

పాలడుగు నాగార్జున డిమాండ్

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య)



నల్లగొండ మండలం అన్నారెడ్డిగూడ గ్రామంలో నీరు లేక పంట పొలాలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని పాలడుగు నాగార్జున తెలిపారు. ఆదివారం గ్రామంలో పంట నష్టాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, అన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన సైదిరెడ్డి అనే రైతు వరి పొలం పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు 100 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని తెలిపారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే, నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్నారెడ్డిగూడ గ్రామంతో పాటు నల్లగొండ మండలంలోని ఇతర గ్రామాల్లో సమగ్ర పంట నష్టం సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని కోరారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించి, భవిష్యత్తులో ఇలాంటి నష్టాలు జరగకుండా సాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కొండా అనురాధ, కొండా వెంకన్న, పోలీస్ సత్యనారాయణ, బతుల బక్కయ్య, బతుల వెంకులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

కమ్మ కతోలిక్ సంఘ అధ్యక్షుడు కొంక శాంసన్

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య)

సంఘ సభ్యులంతా ఐక్యతతో ముందుకు సాగుతూ కమ్మ కతోలిక్ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నల్లగొండ కమ్మ కతోలిక్ సంఘ అధ్యక్షుడు కొంక శాంసన్ అన్నారు. సంఘ సభ్యుల మధ్య పరస్పర సహకారం, ఆత్మీయత మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

ఆదివారం నల్లగొండలోని అశోక గార్డెన్స్‌లో నిర్వహించిన నల్లగొండ కమ్మ కతోలిక్ సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా సభ్యుల సంక్షేమం, సామాజిక సేవకు వేదికగా నిలవాలన్నారు. సభ్యుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంఘం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

ప్రత్యేకంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు విద్యా రంగంలో కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతిభ కనబరిచే విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సాధ్యమైనంత మేరకు అండగా నిలుస్తామన్నారు. వైద్యపరమైన అవసరాలు ఉన్న వారికి కూడా సహాయ సహకారాలు అందించేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

సంఘంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండేలా పరస్పరం ఒకరికొకరు అండగా నిలవాలని సూచించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందినప్పుడు ఆ కుటుంబాన్ని ఒంటరిగా భావించకుండా సంఘం తరఫున ఆర్థికంగా, మానసికంగా అండగా నిలుస్తామని అన్నారు. కష్టకాలంలో సభ్యుల కుటుంబాలకు తోడుగా ఉండటమే సంఘం ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు.యువతను సంఘ కార్యక్రమాల్లో మరింత చురుకుగా భాగస్వాములను చేయాలని, వారి ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సంఘంలో ఉన్న సీనియర్ల అనుభవాలను యువతకు అందించడంతోపాటు, కొత్త తరాన్ని సంఘ



కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని డిసెంబర్ 20న సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శాంసన్ తెలిపారు. ఈ వేడుకల్లో సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక, విద్యా, వైద్య సేవా కార్యక్రమాలను నిర్వహించి సంఘానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు.

సంఘ అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యం కాదని, అందరి భాగస్వామ్యం, సహకారంతోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సభ్యుల సూచనలు, సలహాలను స్వీకరిస్తూ పారదర్శకంగా సంఘ కార్యకలాపాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు రెవరెండ్ ఫాదర్ బాలరాజు, రెవరెండ్ ఫాదర్ ధనరాజు, రెవరెండ్ ఫాదర్ జయ జీవన్, ఉపాధ్యక్షుడు విజయరాజు, కార్యదర్శి బల్ల అర్జయ్య, జనరల్ సెక్రెటరీ రెడ్డి మాస్ కిరణ్ కుమార్, కోశాధికారి గోరంట్ల జయంత్, అసోసియేట్ సభ్యులు ఆంథోనీ భాస్కర్ మారినేని, కూరపాటి కిషోర్, మార్నేని జోసెఫ్, నంబూరు నాగరాజు, ఎన్. ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు

60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం



సూర్యాపేట, అక్టోబర్ 04 :(వార్త వేదిక సూర్య)

సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు.

ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల–మాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

సింగరేణి విరాళంతో ప్రాజెక్టు

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

1,029 విద్యాసంస్థలకు ఆహార సరఫరా

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. జిల్లాలోని సుమారు 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తయారు చేసి సరఫరా చేయడం కమ్యూనిటీ కిచెన్ ప్రధాన ఉద్దేశం. అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన కొన్ని జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించే అంశాన్ని కూడా ప్రణాళికలో చేర్చారు.

నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం

వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థులకు పాఠశాల వేళల్లో పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, సంక్షేమానికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

పనులపై మంత్రి పర్యవేక్షణ

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యాసంస్థలకు సరఫరా వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించనున్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సంబంధిత అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు.

మునగాలలో రూ.9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్

అక్టోబర్ 6న శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

దళిత మహిళపై దాడి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు!

సంఘాల డబ్బుల వ్యవహారంపై వివాదం..

బహిరంగంగా దుర్భాషలు, దాడి చేసినట్లు ఫిర్యాదు

చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు..

దేవరకొండ అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):-

దళిత మహిళపై దాడి ఘటన చింతపల్లి మండలంలో కలకలం రేపుతోంది. సంఘాలకు సంబంధించిన డబ్బుల వ్యవహారంలో తనపై వచ్చిన ఆరోపణలను ప్రశ్నించినందుకు పీకే మల్లేపల్లి గ్రామానికి చెందిన వీవోఏ గనిపల్లి మాధవిపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై చింతపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామపంచాయతీలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న గనిపల్లి మాధవిపై సంఘాలకు సంబంధించిన డబ్బుల విషయంలో కొందరు వ్యక్తులు ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ వద్ద తనపై ఆరోపణలు చేసిన వారిని మాధవి ప్రశ్నిస్తుండగా, గ్రామానికి చెందిన కుప్పల అమర్‌నాథ్ అనే వ్యక్తి తన పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడి దాడికి పాల్పడినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ద్వారా తెలుస్తోంది.

ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లు నమోదు

బాధితురాలి ఫిర్యాదుపై చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 172/2026గా కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 74, 115(2), 352తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం, 2015లోని సెక్షన్లు 3(1)(తీ), 3(1)(o), 3(2)(ఝు)లను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 2, 2026న మధ్యాహ్నం ఘటన జరిగినట్లు, సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు అందినట్లు ఎఫ్ఐఆర్ వివరాలు సూచిస్తున్నాయి.

మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవా?

గ్రామంలో ఏదైనా ఆర్థిక వ్యవహారంపై ఆరోపణలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. అంతేకానీ, బహిరంగంగా దుర్భాషలాడటం, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పియంఎస్ జి యంబివై సేవా సేతు విజయవంతం : డివిజినల్ ఇంజనీర్ సుధాకర్

నాగర్ కర్నూల్ అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్య) :



నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన పియంఎస్ జి యంబివై సేవా సేతు కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని డివిజినల్ ఇంజనీర్ సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని డివిజినల్ ఇంజనీర్ ఎం సుధాకర్ అన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన సేవలను అందించడం జరిగింది. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన అధికారులు, సిబ్బంది, ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ లు శంకరయ్య, ప్రవీణ్ కుమార్, హర్షవర్ధన్ రెడ్డి ఏ ఈ లు మాన్య నాయక్, జానకిరామ్, ప్రదీప్ గౌడ్,కిరణ్ పాల్గొన్నారు


దళిత ఆడబిడ్డపై దాడి చేసిన అమర్నాథ్ గౌడ్ పై ఎస్సీ ఎస్టి అట్రాసిటి కేస్ నమోదు చేయాలి : పాట్ట మురళి మాదిగ డిమాండ్

దేవరకొండ అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):-



చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో ఈనెల 2వ తారీఖున గ్రామ సభ లో ఒక దళిత మహిళ వి ఓఏ అయినటువంటి గనిపల్లి మాధవి పై అనుచిత వాక్యాలు మాట్లాడి ఆమెపై దాడి చేసినటువంటి వ్యక్తి కొప్పోలు అమర్నాథ్ గౌడ్ పై చట్టపరమైన చర్య వెంటనే తీసుకోవాలని రిమాండ్ చేస్తూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదును బట్టి బాధితురాలకు న్యాయం కచ్చితంగా జరగాలి లేకపోతే నియోజకవర్గం వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ పొట్ట మురళి మాదిగ అన్నారు దళిత మహిళకు న్యాయం జరగకపోతే ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో భారీ ఎత్తున నిరసనలు ఉద్యమాలు పోరాటాలు చేస్తామని ఆయన అన్నారు ఈరోజు దేవరకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గరికి చేరుకొని మన జాతి ఆడపడుచు పై జరిగిన దాడినీ తీవ్రంగా ఖండిస్తున్నా మనీ నియోజకవర్గం ఇన్చార్జి పొట్ట మురళి మాదిగ అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు అందుగుల సైదులు మాదిగ కొమ్ము ఉదయ్ కుమార్ సీనియర్ నాయకులు తరి గోవర్ధన్ ఎలిమినేటి ఈశ్వర్ పొట్ట అంజి జుట్టు సతీష్ జినుకుంటా ప్రభాకర్ సలికినేని ఆనంద్ మహేష్ నాగరాజ్ రత్నయ్య జే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 137
సోమవారం
05 అక్టోబర్ 2026



ఒకే మొక్క.. వేల పుష్పాలు!

జడ్చర్ల బొటానికల్ గార్డెన్‌లో సీరోపీజియా జన్సియా అరుదైన పుష్పవిలాసం..

జడ్చర్ల, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

ఒకే మొక్కకు వేల సంఖ్యలో పుష్పాలు పూయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జడ్చర్లలోని డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. గార్డెన్‌లోని కాక్టస్ హౌస్‌లో పెంచుతున్న సీరోపీజియా జన్సియా మొక్క ప్రస్తుతం భారీగా విస్తరించి, వేలాది పుష్పాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చిన్న మొక్కగా వచ్చి.. భారీగా విస్తరించి...

మహబూబ్‌నగర్ శివారు ప్రాంతం నుంచి గత ఏడాది మే నెలలో సేకరించిన చిన్న మొక్కను కాక్టస్ హౌస్‌లో నాటారు. ఇసుక, ఎర్రమట్టిని 3:1 నిష్పత్తిలో కలిపి, స్వల్పంగా కోకోపీట్ జోడించిన ప్రత్యేక మట్టి మిశ్రమంలో మొక్కను పెంచారు. అనుకూల వాతావరణం, తగిన నిర్వహణతో మొక్క వేగంగా అభివృద్ధి చెంది కాక్టస్ హౌస్ అంతటా విస్తరించింది.

నీటి నిర్వహణతో పుష్పాల వెల్లువ?..

మొక్క ఇంత భారీ స్థాయిలో పుష్పించడానికి నీటి నిర్వహణ కూడా ఒక కారణం కావచ్చని గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య తెలిపారు. సాధారణంగా 15 రోజులకు ఒకసారి మాత్రమే నీటిని అందిస్తున్నామని, కాక్టస్ హౌస్‌లోకి వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

తక్కువ తేమ కారణంగా మొక్కలో స్వల్ప నీటి ఒత్తిడి ఏర్పడి ఉండవచ్చని, తన సంతతిని కొనసాగించేందుకు అధిక సంఖ్యలో పుష్పాలను ఉత్పత్తి చేసి ఉండే అవకాశం ఉందని వివరించారు. అయితే దీనిపై మరింత శాస్త్రీయ అధ్యయనం అవసరమని పేర్కొన్నారు.

తక్కువ నైట్రోజన్.. ఎక్కువ పుష్పాలు..

మట్టిలో నైట్రోజన్ పరిమాణం తక్కువగా ఉండటం కూడా మొక్క అధికంగా పుష్పించడానికి దోహదపడి ఉండవచ్చని సదాశివయ్య తెలిపారు. సాధారణంగా ఈ జాతి మొక్కలో తక్కువ సంఖ్యలో పుష్పాలు కనిపిస్తాయని, ఒకే మొక్కపై వేల సంఖ్యలో పుష్పాలు రావడం అరుదైన విషయమని అన్నారు.

అరుదైన మొక్కలకు వేదికగా బొటానికల్ గార్డెన్...

సహజ ఆవాసాల్లో అరుదుగా కనిపించే మొక్కలను సేకరించి, వాటి అవసరాలను అధ్యయనం చేస్తూ అనుకూల వాతావరణంలో పెంచుతున్నామని డాక్టర్ సదాశివయ్య తెలిపారు. ఇలాంటి అరుదైన పుష్పోత్పత్తి ఘటనలు వృక్షశాస్త్రం, జీవశాస్త్ర విద్యార్థులకు ప్రత్యక్ష అధ్యయనానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు.

మొక్కల అనుకూలన, నీటి ఒత్తిడి, మట్టి స్వభావం, పుష్పోత్పత్తి వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశం విద్యార్థులకు లభిస్తుందని వివరించారు.

ప్రిన్సిపల్ అభినందనలు..

ఒకే మొక్కకు వేల సంఖ్యలో పుష్పాలు పూయడాన్ని పరిశీలించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జీ. సుకన్య గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్యతో పాటు నిర్వహణలో భాగస్వాములైన విద్యార్థులను అభినందించారు. అరుదైన మొక్కలను సంరక్షిస్తూ, వాటిని విద్యార్థుల అధ్యయనానికి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.

సేలువురోజే ఎందుకీ ఆరాటం?

అభివృద్ధి పేరుతో చెట్లపై వేట.. ఇప్పుడే ఎందుకీ హడావుడి?

ఎంవీఎస్‌లో చెట్ల నరికివేత.. దీని వెనుక ఆంతర్యమేంటి?

పచ్చదనంపై గొడ్డలి వేట.. అభివృద్ధి ముసుగులో ఏం జరుగుతోంది?

ఎంవీఎస్‌లో పచ్చదనం కనుమరుగు.. అభివృద్ధి పేరుతో ప్రకృతి విధ్వంసమా?

అభివృద్ధి పేరుతో వందలాది చెట్ల నరికివేత?

పచ్చదనానికి మారుపేరైన ఎంవీఎస్ జూనియర్ కళాశాలలో ఆందోళనకర దృశ్యం



మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

పచ్చదనానికి మారుపేరుగా నిలిచిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎంవీఎస్ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనుల పేరుతో పెద్ద సంఖ్యలో చెట్లను నరికివేస్తున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది.కళాశాల ఆవరణలో ఏళ్ల తరబడి పెరిగిన వృక్షాలు విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు, నగరంలో పచ్చదనాన్ని కాపాడటంలో కీలకంగా నిలిచాయి. అయితే ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో కొన్ని వందల చెట్లను తొలగిస్తున్నట్లు తెలుస్తుండటంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి అవసరమే.. కానీ చెట్లను కాపాడేదెలా?

విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, అందుకోసం భారీ వృక్షాలను పూర్తిగా తొలగించాల్సిందేనా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సాధ్యమైన చోట్ల చెట్లను కాపాడుతూ నిర్మాణాలు చేపట్టే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. ఏళ్ల తరబడి పెరిగిన చెట్లను తొలగించడం ద్వారా పచ్చదనం కోల్పోయే ప్రమాదం ఉందని, అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు

కళాశాలలో ఎన్ని చెట్లు తొలగిస్తున్నారు? వాటి తొలగింపునకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? నరికివేతకు బదులుగా ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పచ్చదనానికి ప్రసిద్ధి చెందిన ఎంవీఎస్ కళాశాలలో చెట్ల సంరక్షణపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

రహస్య పత్రాలకు రక్షణ ఏది?

పట్టాదారులకు తెలియకుండానే పత్రాల జారీ? నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంపై ప్రశ్నల వర్షం

మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

భూ రికార్డులు అత్యంత కీలకమైన ప్రభుత్వ పత్రాలు. ఒక సర్వే నంబర్‌కు సంబంధించిన పాసుబుక్, పాత రెవెన్యూ రికార్డులు, హక్కులకు సంబంధించిన ఆధారాలు ఎవరి అనుమతి లేకుండా ఇతరుల చేతికి చేరితే పరిస్థితి ఎలా ఉంటుంది? ప్రస్తుతం నవాబుపేట మండల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వినిపిస్తున్న ఆరోపణలు ఇదే ప్రశ్నను లేవనెత్తుతున్నాయి.

ఒక సర్వే నంబర్‌పై ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత భూమిపై తమకు హక్కు ఉందని నిరూపించే పాసుబుక్, పాత రికార్డులు లేదా ఇతర ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. అయితే నవాబుపేట తహసీల్దార్ కార్యాలయంలో కొన్ని భూ రికార్డులకు సంబంధించి ఇలాంటి ఆధారాలు లేకుండానే పత్రాలు ఇతరులకు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టాదారుడి ప్రమేయం లేకుండానే రికార్డులు ఎలా?

తమ భూమికి సంబంధించిన పాత రికార్డులు, ఓల్డ్ ఆర్వోఆర్ తదితర పత్రాలు తమకు తెలియకుండానే ఇతరులకు అందుతున్నాయని కొందరు పట్టాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అసలు దరఖాస్తుదారుడు ఎవరు? ఏ ఆధారాలతో దరఖాస్తు చేసుకున్నారు? సంబంధిత రికార్డులను ఎవరి అనుమతితో పరిశీలించారు? అనే అంశాలపై స్పష్టత అవసరమని ప్రజలు కోరుతున్నారు.

రికార్డుల మార్పిడి వెనుక ఉద్దేశమేంటి?

భూ రికార్డుల విషయంలో చిన్నపాటి మార్పు కూడా భవిష్యత్తులో పెద్ద వివాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఒకరి పేరు ఉన్న రికార్డును తొలగించి మరొకరి పేరు చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయా? పాత రికార్డులు ఎవరి ప్రయోజనం కోసం బయటకు వెళ్తున్నాయి? వాటిని అందజేసే అధికారిక ప్రక్రియ ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రికార్డులు ఇతరులకు అందజేయడం వెనుక ఎవరి ప్రయోజనం ఉంది, ఎలాంటి లాభం ఆశిస్తున్నారు అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలని మండలంలోని పలువురు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విచారణకు డిమాండ్

భూ రికార్డుల భద్రతపై తహసీల్దార్ కార్యాలయం స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, ఎవరి దరఖాస్తు మేరకు ఏ పత్రాలు జారీ చేశారు, వాటికి సమర్పించిన ఆధారాలు ఏమిటి, నిబంధనల ప్రకారం ప్రక్రియ జరిగిందా అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

"భూ రికార్డులు ఎవరి చేతుల్లో పడితే వారి ఇష్టానుసారం మారిపోతాయా?" అనే ప్రశ్నకు రెవెన్యూ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలి

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ఎంపీ డీకే అరుణ తీవ్ర విమర్శలు..



మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తావేదిక సూర్య):

బీజేపీ రాష్ట్ర కార్యాలయం: ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు పిటిషన్లు వేయిస్తున్నారని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు.

గతంలో పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక అదే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నిజంగా ప్రజాబలం ఉంటే తమ పదవులకు రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.

ప్రభుత్వం అన్ని హామీలను అమలు చేసిందని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు మళ్లీ ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజకీయ దిగజారుడుతనానికి పాల్పడుతున్నాయని ఆరోపించారు.

గతంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ గెలుచుకుందని, రాబోయే ఎన్నికల్లోనూ అక్కడ ఘన విజయం సాధిస్తామనే నమ్మకం ఉందని డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనను ప్రజలు చూశారని, రెండు పార్టీలు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు.

ఓబీసీ మహాసభకు షాద్‌నగర్ నుంచి భారీ కదలిక..





వెయ్యికి పైగా వాహనాలతో శంషాబాద్‌కు బయలుదేరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్... కాంగ్రెస్ శ్రేణుల కోలాహలం.. గజమాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం...

మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

ఓబీసీల హక్కుల సాధనే లక్ష్యంగా శంషాబాద్‌లో నిర్వహించనున్న ఓబీసీ మహా బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో వెయ్యికి పైగా వాహనాలతో భారీ ర్యాలీగా శంషాబాద్‌కు బయలుదేరారు. కాంగ్రెస్ జెండాలు చేతబట్టి కార్యకర్తలు చేసిన నినాదాలతో షాద్‌నగర్ పట్టణం మార్మోగింది.

అంబేద్కర్‌కు నివాళులర్పించి ర్యాలీ ప్రారంభం..

శంషాబాద్ పరిధిలోని గొల్లపల్లిలో జరగనున్న ఓబీసీ మహా బహిరంగ సభ నేపథ్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తొలుత చౌదమ్మగుట్టలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ వాహన శ్రేణితో షాద్‌నగర్ పట్టణానికి చేరుకున్నారు. పట్టణ కూడలిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా పట్టణ కూడలిలో బాణసంచా పేలుళ్లు, కాంగ్రెస్ నినాదాలు, కార్యకర్తల నృత్యాలతో సందడి నెలకొంది. ఎమ్మెల్యే సైతం కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేస్తూ వారిలో జోష్ నింపారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి శంషాబాద్‌కు బయలుదేరారు.

బీసీల హక్కుల కోసం పోరాటం ఆగదు...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతికి కులగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. బీసీలకు న్యాయమైన హక్కులు, అవకాశాలు దక్కాలంటే కులగణన తప్పనిసరి అని అన్నారు. బీసీ కులగణన పూర్తయ్యే వరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఓబీసీల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న మహాసభకు షాద్‌నగర్ నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల ఐక్యత, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

భారీగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు..

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, రఘునాయక్, బాలరాజు గౌడ్, చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కేకే కృష్ణ, చల్లా శ్రీకాంత్ రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, జాంగారి రవి, జమ్రుద్ ఖాన్, ఇబ్రాహీం, గుట్ట రాజు తదితర నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో షాద్‌నగర్‌లో రాజకీయ సందడి నెలకొంది.

మహబూబ్‌నగర్



శరన్నవరాత్రోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌కు ఆహ్వానం..

ఆహ్వాన పత్రిక అందజేసిన కావేరమ్మపేట దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు..

మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

జడ్చర్ల పట్టణంలోని కావేరమ్మపేటలో ఘనంగా నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ మహోత్సవాలకు జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆదివారం దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన నివాసానికి వెళ్లి ఉత్సవాలకు హాజరుకావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలను మాజీ ఎమ్మెల్యేకు వివరించి, ఆహ్వాన పత్రికను అందజేశారు. కావేరమ్మపేటలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఏడాది దసరా నవరాత్రి ఉత్సవాలను భక్తుల భాగస్వామ్యంతో సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరుతూ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్నహస్తం..

ఇద్దరు విద్యార్థులకు అండగా నిలిచిన మాజీ ఎంపీపీ!

హాస్టల్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులను గుర్తించి.. స్వయంగా కారులో తీసుకెళ్లి సురక్షితంగా అప్పగింత

మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 4 వార్త వేదిక సూర్య):



హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చిన ఇద్దరు విద్యార్థులను సమయస్ఫూర్తితో గుర్తించిన నవాబుపేట మాజీ ఎంపీపీ శ్రీనివాస్ మానవత్వాన్ని చాటుకున్నారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థి రాకేష్, ఏడో తరగతి విద్యార్థి చరణ్ ఆదివారం ఉదయం హాస్టల్ నుంచి బయటకు వచ్చారు. ఈ క్రమంలో నవాబుపేట మండల కేంద్రం సమీపంలో వెళ్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఆయన స్నేహితుడు నరేందర్ విద్యార్థులను గుర్తించారు. వారిని ఆపి వివరాలు అడగగా చౌదూరు గ్రామానికి చెందినవారమని, ఇంటికి వెళ్తున్నామని తెలిపారు. అనుమానం రావడంతో శ్రీనివాస్ తల్లిదండ్రులకు ఫోన్ చేయగా పిల్లలు ఇంటికి చేరలేదని తెలిసింది. వెంటనే హాస్టల్ వార్డెన్‌కు సమాచారం అందించి, విద్యార్థులను తన కారులో తీసుకెళ్లి కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల సిబ్బందికి సురక్షితంగా అప్పగించారు.

సమయానికి స్పందించి ఇద్దరు విద్యార్థులకు అండగా నిలిచిన మాజీ ఎంపీపీ శ్రీనివాస్ సేవాభావాన్ని పలువురు అభినందించారు. పిల్లల భద్రత పట్ల ఆయన చూపిన బాధ్యతాయుతమైన వైఖరిని తల్లిదండ్రులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్గీయ హాది షాహాబ్ సేవలు మరువలేనివి..

మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్...

మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):



మహబూబ్‌నగర్ ఎంఐఎం అధ్యక్షుడిగా సేవలందించిన స్వర్గీయ హాది షాహాబ్ స్మారకార్థం సంతాప సభను నగరంలోని షాలిమార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ హాజరై హాది షాహాబ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ హాది షాహాబ్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో హాది షాహాబ్ అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. పరిపాలనా వ్యవహారాల్లో ఎన్నో విలువైన సూచనలు చేస్తూ, మంచి చెడులను వివరిస్తూ తనకు ఎల్లప్పుడూ అండగా నిలిచేవారని గుర్తుచేశారు. ఒక నాయకుడిగా మాత్రమే కాకుండా అందరితో ఆప్యాయంగా మెలిగే పెద్దమనిషిగా హాది షాహాబ్ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు.

సమాజం కోసం ఆయన చేసిన సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం చిరస్మరణీయమని, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ ప్రజల మనసుల్లో నిలిచిపోతాయని ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

ఈ సంతాప సభలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కోత్వాల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, సాధత్‌లు, రాజకీయ నాయకులు, మత పెద్దలు, హాది షాహాబ్ అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కాంగ్రెస్ 'ప్రజాపాలన'లోనే బీసీలకు నిజమైన ఆత్మగౌరవం

బత్తిని ఉప్పలయ్య గౌడ్

ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 04, (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఓబీసీ వర్గాల సామాజిక, ఆర్థిక పురోగతికి సంపూర్ణంగా కట్టుబడి పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ యాదాద్రి ఓబీసీ జిల్లా అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

-'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్' -- బీసీ మహిళ సాధికారతకు విప్లవం

బీసీ మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం' చారిత్రాత్మకమని ఉప్పలయ్య గౌడ్ కొనియాడారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి 1,000 మంది చొప్పున మొత్తం 1,19,000 మంది అర్హులైన బీసీ మహిళలకు 100% సబ్సిడీతో రూ. 12,000 విలువైన ఆటోమేటిక్ కుట్టు మిషన్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. మిషన్లతో పాటు ఆధునిక శిక్షణ ఇచ్చి మహిళలు స్వయం ఉపాధితో స్థిరపడేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

-బీసీల కోసం నూతన ప్రణాళికలు -- కుల గణన, బిసి సబ్‌ప్లాన్ సాధన

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన/సర్వే ద్వారా జనాభా ప్రాతిపదికన బీసీలకు రాబోయే రోజుల్లో సంక్షేమ ఫలాలు, రాజకీయ అవకాశాలు తగిన రీతిలో దక్కుతాయని తెలిపారు. బీసీల సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యర్థి రాజకీయాలకు అతీతంగా 'బీసీ సబ్‌ప్లాన్' ఏర్పాటు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, బీసీ కార్పొరేషన్ల ద్వారా వ్యాపార, కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు.



-నాయకుల సమన్వయంతో ఉమ్మడి జిల్లా ప్రగతి పథం

ఉమ్మడి నల్గొండ మరియు యాదాద్రి భువనగిరి జిల్లాల సర్వాంగీణ అభివృద్ధికి రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు సంపూర్ణ సమన్వయంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. మౌలిక వసతులు, నియోజకవర్గ నిధుల సాధనతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి ఇంట చేరేలా వీరంతా శ్రమిస్తున్నారని వెల్లడించారు. బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ప్రచారం చేస్తామని బత్తిని ఉప్పలయ్య గౌడ్ తెలిపారు.



యాదాద్రి భువనగిరి

దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ చిట్టెడి

వలిగొండ: అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో అరూరు గ్రామానికి చెందిన పాండాల కృష్ణ గౌడ్,ఇటీవల మరణించారు. ఆదివారం నిర్వహించిన దశదిన కర్మ లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మాజీ ఎంపీపీ చిట్టే డి జనార్దన్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సి ఎన్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త బోగారం రమేష్ యాదాద్రి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు జినుకల కృష్ణవలిగొండ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి, అరూరు గ్రామ మాజీ సర్పంచ్ పోలేపాక చెమ్మయ్య, అరూరు గౌడ సంఘం అధ్యక్షులు కళ్లెం బాల శంకర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి, చిట్టేడి దామోదర్ రెడ్డి,మాజీ మత్స్యగిరి గుట్ట ధర్మకర్త బండి రవికుమార్, వార్డు మెంబర్ ఆవుల బిక్షపతి, బి.ఆర్ .ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుకొడితాల నాగరాజు, బత్తిని నగేష్ గౌడ్, దాత్కర్ వినోద్ కుమార్, చిలుకమర్రి దైవానంద చారి, ఆముదం గణేష్ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోస్టర్ సవరణ సాధనకై ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే సభకు బయలుదేరిన మాల సంఘం నాయకులు

అడ్డగూడూర్, అక్టోబర్ 4(వార్త వేదిక సూర్య)



ప్రభుత్వ ఉద్యోగాలు, నియామకాలలో రిజర్వేషన్ రోస్టర్ ను సవరించి మాలలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మాల మహానాడు నాయకులు అన్నారు. ఈ రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తూ ఆదివారం అడ్డగూడూరు మండలం కేంద్రం నుంచి హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే సభకు భారీ ఎత్తున మాల సంఘ నాయకులు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పిల్లి గంగయ్య, ఎలిజాల ప్రవీణ్, ఉప్పుల సైదులు, కొరిమిళ్ళ కర్ణాకర్, నీలం ఉమేష్, ఉప్పుల శాంతి కుమార్, కురిమిళ్ళ రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య): నల్లగొండబిఖమ్మం బివరంగల్ పట్టా బద్రుల నియోజకవర్గ పరిధిలో అర్వత కల్గిన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షులు బద్దం నాగార్జున రెడ్డి లు కోరారు.ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో పట్టబద్రులుగా ఓటరుగా నమోదైన ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా ఫారం 18 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి జ్ఞానమాల కార్యక్రమం

- ఎంతో ఉపయోగపడుతుంది ఎమ్మార్పీఎస్

బిజెపి మేడ్చల్ ఇంచార్జ్ సుదర్శన్ రెడ్డి.

బీబీనగర్ అక్టోబర్ 4 వార్తా వేదిక సూర్య.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాడిగల్ల బాబురావు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 67వ వారం జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి ఈ జ్ఞానమాల కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని నేటి యువత అంబేద్కర్ ఆశలను అనుసరించి ఉన్నంత చదువులు చదివి ఉన్నంత స్థాయికి ఎదగాలని తెలియజేశారు. అంబేద్కర్ తన జ్ఞానంతో ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారు అని మరొక్కసారి కోరుతూ నేటి యువత ఆ మహనీయులు అడుగుజాడల్లో నడవాలని ప్రసంగించారు ఈ జ్ఞానమాల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడం పాండురంగం మాజీ సర్పంచ్ శివగల ఇస్తారి ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు చిన్నగల్లు అశోక్ భూషపాక మల్లేష్ ఉపాధ్యక్షులు చిన్నగన్న లింగస్వామి కడం సాయి ప్రసాద్ మంద శ్రీశైలం చిన్నగల గణేష్ పంజాల



అశోక్ జల్లి అభిలాష్ కడం నరసింహ బొడ్డు శివ బాబు బొడ్డు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- మాజీ టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం

సంస్థాన్ నారాయణపురం: అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్య):



యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని బిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల మండలం తీవ్ర పంట నష్టాన్ని ఎదుర్కొంటోందని, నీటి ఎద్దడి వల్ల ఎండిపోతున్న పంటలను చూసి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఎకరాల కొద్దీ పంట నష్టపోయిన రైతాంగానికి తక్షణమే నష్టపరిహారం అందించాలని మరియు వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం స్పందించి మండలంలో కరువు నివారణ చర్యలు చేపట్టాలని, రైతులకు సాగునీరు మరియు ఆర్థిక ఊరట కలిగించాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ బెల్టు షాపులను మూసివేయాలి



తుర్కపల్లి మండల్ 04 (వార్త వేదిక సూర్య):

మాదాపూర్ గ్రామంలో అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నటువంటి బెల్టు షాపులను రద్దు చేయాలని గ్రామ యువత పెద్ద ఎత్తున ఒక మంచి సంకల్పంచి, గ్రామస్తులు 100 సంతకాలు సేకరించి, రద్దు చేయాలనీ గ్రామ సర్పంచ్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గ్రామంలో బెల్టు షాప్ లు నిర్వహించడం వల్ల, ఉదయం,రాత్రి తేడా లేకుండా మా గ్రామ వాసులు మద్యం సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. అంతే కాకుండా చేసిన పనిలో వచ్చిన సంపాదన లో మొత్తం మద్యానికి ఖర్చుకావడం తో,వారి కుటుంబం ఆర్థికంగా, సామజికంగా నష్టపోవడం జరుగుతుందని యువత పేర్కొన్నారు. దీనిపై సర్పంచ్ సీత రాజు , గ్రామ యువతను అభినందిస్తూ, దీనివల్ల ప్రాణాలు కోల్పోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేస్తూ, మీరు చేస్తున్న ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, నేను భాగస్వామ్యం అవుతా అని, 3 రోజులలో మొత్తం బెల్ట్ షాప్ లను రద్దు చేపిస్తా అని, ఈ రోజే గ్రామ పంచాయతీ నుండి నోటీసు లు ఇచ్చి, 3 రోజులలో రద్దు చేపిస్తా అని వాగ్దానం చేయండి జరిగింది.

షరతుల్లేకుండా గీత కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలి

- యాదాద్రి కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

- గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోలగాని జయరాములు

మోటకొండూరు, అక్టోబరు 4

(వార్త వేధిక సూర్య):-

రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇస్తున్న పెన్షన్ విషయంలో ఎలాంటి షరతులు, నిబంధనలు లేకుండా అర్హులైన వారందరికీ మంజూరు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోలగాని జయరాములు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాలో జిల్లాలోని గీత కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశం తండా రంగయ్య గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జయరాములు పాల్గొని మాట్లాడుతూ.. చేతివృత్తులలో కల్లుగీత అ త్యంత ప్రమాదకరమైనదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబ పోషణ కోసం కార్మికులు ఈ వృత్తిని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పనిచేసే ఇటువంటి వృత్తికి ప్రభుత్వం రక్షణ, సంక్షేమం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. సంఘం నాయకులు చేసిన అనేక పోరాటాల ఫలితంగానే ప్రభుత్వాలు గీత కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాయని గుర్తుచేశారు.

కానీ, ప్రస్తుత ప్ర భుత్వం అనేక కొత్త నిబంధనలు, షరతులు విధించడం వల్ల అర్హులైన ఎంతోమంది గీత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం



వెంటనే పునరాలోచించి ఆ నిబంధనలను తొలగించాలన్నారు. అలాగే, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేర కు గీతన్నల పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచి తక్షణ మే అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు గాజుల బాలరాజు, ఉపాధ్యక్షుడు లోడె ఉప్పలయ్య, సంఘం నాయకులు తండా రాములు, తాళ్లపల్లి వెంకటయ్య, సీసా ఇస్తారి, రుద్రబోయిన మల్లేష్, వంగాల చంద్రమౌళి, దూడల శ్రీనివాస్, గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం జాతీయ సమావేశాలు

హిందూ ధర్మ రక్షణ, దేవాలయాల భద్రతపై కీలక చర్చలు

18 రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రతినిధులు

పాల్గొన్న మిజోరం మాజీ గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్

యాదాద్రి భువనగిరి/వార్త వేధిక సూర్య :-

యాదాద్రిలోని వాసవి సత్రంలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం (ఎస్ఎస్ఎస్) 18వ జాతీయ కార్యవర్గ సమావేశాలు రెండు రోజుల పాటు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ ప్రతిష్టాత్మక సమావేశాలకు దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.సమావేశాల అనంతరం ఎస్ఎస్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి నాయని లచ్చిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈ రెండు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ప్రధానంగా.. సనాతన ధర్మ పరిరక్షణ, దేశవ్యాప్తంగా పెరుగుతున్న మతమార్పిడులు, జిహాదీ శక్తుల ఆగడాలు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న వరుస దాడులు వంటి పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. హిందూ ధర్మ రక్షణతో పాటు ఆలయాల భద్రత విషయంలో ప్రతి ఒక్క హిందువు అప్రమత్తంగా ఉండి, సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో మిజోరం మాజీ గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్, ఎస్ఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు మురుగన్ సెల్వం, జాతీయ కార్యదర్శి నాయని బుచ్చిరెడ్డి, ట్రస్టీ అయితారాములు, రాష్ట్ర అధ్యక్షుడు కుంచపు ధనుంజయ్, రాష్ట్ర కార్యదర్శి తలారి కిరణ్ కుమార్, కోశాధికారి లలిత్ కుమార్, ప్రముఖ ప్రతినిధులు శేతుమాధవన్, రాజేంద్రన్, విశ్వం బాబాజీ తదితరులు పాల్గొన్నారు.



అభయహస్తం' అమలుకై 5న బైక్ ర్యాలీ

- ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు బొట్ల పరమేష్ మాదిగ

మోటకొండూరు, అక్టోబరు 4(వార్త వేధిక సూర్య):-

అభయహస్తం పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం మోటకొండూరు మండల అధ్యక్షుడు బొట్ల పరమేష్ మాదిగ పిలుపునిచ్చారు.ఈ బైక్ ర్యాలీ అడ్డగూడూరు నుంచి ప్రారంభమై భువనగిరి జిల్లా కేంద్రం వరకు కొనసాగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సోదరులు, యువత పెద్ద ఎత్తున తమ తమ వాహనాలతో తరలివచ్చి ఈ బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



కుమ్మరి సంఘ భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం



ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 04, (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల శ్రీ లక్ష్మీ నరసింహ కుమ్మరి సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు గ్రామ సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్ ని, మాజీ జడ్పీటీసీ సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తాని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంఘ భవన నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై సర్పంచ్, మాజీ జడ్పీటీసీ సభ్యులుతో సంఘ సభ్యులు చర్చించారు. కుమ్మరి సంఘం అభివృద్ధికి, సంఘ భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. సంఘ భవనం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.కుమ్మరి సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇవ్వడం పట్ల సంఘ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ ఐక్యత, అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మద్దికుంట దుర్గయ్య, గౌరవ అధ్యక్షులు గర్షకోట లక్ష్మీ నర్సయ్య, కార్యవర్గ సభ్యులు గర్షకోట కిష్టయ్య, తాడూరి సాయిలు, గర్షకోట పెద్ద నర్సింహ, గర్షకోట వెంకన్న, గర్షకోట నర్సింహ, గర్షకోట యాదగిరి, మద్దికుంట రమేష్, మద్దికుంట గోపాల్, గర్షకోట శ్రీనివాస్(కోశాధికారి), గర్షకోట నవీన్ కుమార్(ప్రధాన కార్యదర్శి), గర్షకోట మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 137
సోమవారం
అక్టోబర్ 5, 2026



యాదాద్రి భువనగిరి

మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

దశాబ్దాలుగా నోచుకొని సమస్య.....

చిరకాల వాంఛ నెరవేర్చాలని పలువురు డిమాండ్.

మోత్కూరు, అక్టోబర్ 4(వార్త వేదిక సూర్య): మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు నోచుకోలేక తమ చదువులను ఇంటర్మీడియట్ వరకే స్వస్తి చెప్పవలసిన స్వస్తి చెప్పవలసిన వస్తుంది. ఇక్కడ డిగ్రీ కళాశాల లేక ఉన్నత విద్య కోసం ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఫీజుల మోతతో ఆశ్రయించలేని పరిస్థితి ఏర్పడింది. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించుట కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యకు నోచుకోవాలంటే మోత్కూరుకు 50 కి.మీ. దూరంలో ఉన్న రామన్నపేట,నల్లగొండ,ఆలేరు 100 కి.మీ.హైదరాబాద్, వరంగల్ ప్రాంతాలకు వెళ్తున్నారని తద్వారా త్రీవ ఇబ్బందులు పడుతున్నారు. మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని 1985 నుంచి 2026 వరకు ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, పి.డి.ఎస్.యు.బీసీ విద్యార్థి సంఘం, బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో తరగతుల బహిష్కరణ, ధర్నాలు, రాస్తారోకో,ప్లకార్డు ప్రదర్శన, సంతకాల సేకరణ, తహశీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ వినతి పత్రాలను అందజేశారు. ఈ దశల వారీగా ఉద్యమంలో బాగంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ మంత్రులకు వినతి పత్రాలను అందజేయడంతో పాటు ముఖ్యమంత్రులకు పోస్ట్ కార్డులు పంపించారు.ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల మోత్కూరు మండలానికి అనుసంధానంగా ఉన్న గుండాల, ఆత్మకూరు (ఎం), అడ్డగూడూరు మండలాలకు మండలాల విద్యార్థులకు మంచి సౌకర్యంగా ఉంటుంది. గత నాలుగున్నర దశాబ్దాలుగా 1985 నుంచి 2024 ఈ ప్రాంతం నుండి పోటీ చేసిన ప్రతి ఎమ్మెల్యే, కూడా ఎంపీ అభ్యర్థులు మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేస్తున్నారే తప్పా...అమలు చేయడంలో పూర్తిగా విఫలమైయ్యారు.ఈ ప్రాంత విద్యార్థులకు చిరకాల వాంఛనైనా మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయుటకు ప్రజా ప్రతినిధులు అధికారులు,కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలి



మత్స్యగిరి బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ అధ్యక్షులు మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకో లు అనేక నిరసన కార్యక్రమాలు చేసినప్పటికీ పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ఎంపీ ఎమ్మెల్యే మంత్రులకు వినతి పత్రాలతో పాటు ముఖ్యమంత్రి కి పోస్ట్ కార్డులు పంపించాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలి.

పోరాటాలతో డిగ్రీ కళాశాల సాధిస్తాం

ఉప్పల శాంతి కుమార్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గత నాలుగున్నర దశాబ్దాల నుండి అనేక విద్యార్థి సంఘాలతో పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు ప్రజా ప్రతినిధులు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైయ్యారు. ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం తమ సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు నిర్వహించి కళాశాల సాధిస్తాం.

అక్టోబర్ 6న ఓయూలో జరిగే ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభను జయప్రదం చేయండి

మోత్కూరు అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య): అక్టోబర్ 6న హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగే ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభను ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు నల్ల చంద్రస్వామి మాదిగ, మండల అధ్యక్షులు గణపాక నవీన్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్.ఎఫ్ వార్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ వార్డ్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ 5వార్డు చెడిపల్లి మల్లేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా చిర్రగూడూర్ ప్రతాప్ మాదిగ, కార్యదర్శిగా చుక్క కిరణ్, కోశాధికారిగా సిహెచ్ బాబు, సంయుక్త కార్యదర్శిగా జి.రాజు ఎంఎస్ఎఫ్ అధ్యక్షులుగా గుగ్గిళ్ళ వెంకన్న, ఉపాధ్యక్షుడుగా గుగ్గిళ్ళ సురేష్, కార్యదర్శిగా కేసగల్ల ఉమేష్, సహిత కరేజ్ గా చెడిపల్లి నరేష్ లను ఎన్నుకున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 6న మాదిగ విద్యార్థి సమాఖ్య జాతీయ సదస్సు



ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 04, (వార్త వేదిక సూర్య):యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంఈ నెల 6న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎమ్మెస్సెస్) జాతీయ ప్రతినిధుల మహాసభను పురస్కరించుకుని ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలోని భువనగిరి – మోత్కూర్ ప్రధాన రహదారి వద్ద 'ఛలో ఉస్మానియా' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెస్సెఫ్ సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు నల్ల చంద్ర స్వామి మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎమ్మెస్సెఫ్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. వర్గీకరణ ఫలాలు పొందిన మాదిగ విద్యార్థులంతా సమాఖ్యలో చేరి జాతి భవిష్యత్తు కోసం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 6న జరిగే సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని, కావున మండలంలోని ప్రతీ గ్రామం నుండి విద్యార్థులు భారీగా తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మామిడి అనిల్ మాదిగ, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు జిట్టా యాదగిరి మాదిగ, సీనియర్ నాయకులు గట్టు రాములు మాదిగ, గట్టు శేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధికార ప్రతినిధి గట్టు అజయ్ మాదిగ, ఎమ్మెస్పీ పట్టణ ప్రధాన కార్యదర్శి గట్టు శరత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు ఇంజమూరి నాగరాజు మాదిగ, ఎమ్మెస్సెఫ్ నాయకులు సూరారం శ్రీకాంత్ మాదిగ, మామిడి నిఖిల్ మాదిగ, గాదె మోహన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నేడు సన్మానం

మోత్కూరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య): మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వనరుల కేంద్ర పరిధిలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ ఉద్యోగులకు ఈనెల 5న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సన్మానం చేస్తున్నామని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) తంగళ్ళపల్లి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సన్మానం కార్యక్రమానికి మండలంలో పనిచేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత,కేజీబీవీ టీ.ఎస్.డబ్ల్యూ ఆర్.ఎస్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాలనీల్లో 10 విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మోత్కూరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 11 వార్డులో పోతాయిగడ్డ ప్రాంతంలోని పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలను ఆదివారం ఆ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్ చేయించారు.చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయా ప్రజల కౌన్సిలర్ వెంకన్న దృష్టికి తీసుకుపోవడంతో 10 విద్యుత్ స్తంభాలు నాటించి,వాటికి వైర్ లైన్ ఏర్పాటు చేసి వీధిలైట్లు అమర్చించారు.దీంతో కాలనీవాసులకు రాత్రివేళల్లో వెలుతురు సౌకర్యం లభ్యం అయ్యింది. తమ విద్యుత్ సమస్యను పరిష్కరించిన వెంకన్నకు ఆయా కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ మత్స్యగిరి, సిబ్బంది నహీమ్, సురేందర్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే బ్రహ్మాస్త్రం

- ఎస్పై కుమారస్వామి యాదవ్

- సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల కార్యక్రమం

- వ్యాపారస్తులతో సమావేశం

మోటకొండూరు, అక్టోబర్ 4 (వార్త వేధిక సూర్య):-

నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని మోటకొండూరు ఎస్పై కుమారస్వామి యాదవ్ అన్నారు. మోటకొండూరు మండల కేంద్రంలో స్థానిక వ్యాపారస్తులు, షాపుల యజమానులతో కలిసి సీసీ కెమెరాల ఏర్పాటు, పాత కెమెరాల మరమ్మతుల కార్యక్రమాన్ని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, కిరాణా షాపుల వద్ద ఉన్న సీసీ కెమెరాల పనితీరును పోలీసులు పరిశీలించారు. సాంకేతిక లోపాలతో పనిచేయని కెమెరాలను గుర్తించి, తక్షణమే మెకానిక్‌లతో వాటికి మరమ్మతులు చేయించారు. భద్రత దృష్ట్యా మరింత నిఘా అవసరమైన సున్నితమైన ప్రాంతాలు, షాపుల వద్ద నూతనంగా సీసీ కెమెరాలను బిగించేందుకు షాపుల యజమానులతో సమన్వయం చేసుకున్నారు. అనంతరం వ్యాపారస్తులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్పై కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు పోలీసులకు మూడో కన్ను లాంటివని అభివర్ణించారు. గ్రామాల్లో దొంగతనాలు, ఆకతాయిల చేష్టలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు నిందితులను సులువుగా గుర్తించడానికి ఇవి ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. పోలీసులు 24 గంటలు ప్రతి చోటా ఉండలేరని, కానీ సీసీ కెమెరాలు నిరంతరం కాపలాదారుల్లా పనిచేస్తాయని గుర్తుచేశారు.ప్రతి వ్యాపారస్తుడు సామాజిక బాధ్యతగా తమ



షాపుల లోపల, బయట వీధిని కవర్ చేసేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల వ్యాపారుల ఆస్తులకు సైతం పూర్తి రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు. పాత నేరస్తులు, లేదా అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసుల సూచనల మేరకు కెమెరాల ఏర్పాటు, మరమ్మతులకు సహకరించిన స్థానిక షాపుల యజమానులను ఎస్పై ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు పోలీసు సిబ్బంది, వర్తక సంఘం ప్రతినిధులు, స్థానిక షాపుల యజమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

వలిగొండ :అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

వలిగొండ మండలంలో బహుజన్ సమాజ్ పార్టీ భువనగిరి నియోజకవర్గ అధ్యక్షులు సుక్క శ్రీకాంత్ ఆధ్వర్యంలో అక్టోబర్ 9 న బీఎస్పీ ఫౌండర్ కాన్షీరాం గారి వర్ధంతి సందర్భంగా జరిగే బహుజన రాజ్యాధికార సమరబేరి సభ గోడ పోస్టర్ విడుదల చేశారు.

ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గంధమల్ల లింగస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బహుజన సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు.భువనగిరి అసెంబ్లీ అధ్యక్షులు సుక్క శ్రీకాంత్ మాట్లాడుతూ వలిగొండ మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, బహుజన సమాజంలో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మస్కు నరసింహ ,వీర్లపల్లి పరుశరాములు,అరూర్ సెక్టార్ అధ్యక్షులు ముప్పిడి నవీన్ , గోపరాజుపల్లి సెక్టార్ అధ్యక్షులు సలిగంజి నవీన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జనసేన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మేడి కుమార్‌కు సన్మానం

వలిగొండ, అక్టోబర్ 4 (వార్తావేదిక సూర్య):



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నల్గొండ- ఖమ్మం- వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వలిగొండ మండల జనసేన అధ్యక్షులు, గోపరాజు పల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ మేడి కుమార్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఇన్చార్జి మత్స్య కిరణ్ గౌడ్ జనసేన జిల్లా నాయకులు పల్లపు మహేష్ మామిడాల రమేష్ జనసేన మండల నాయకులు నరేష్ , జన నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

మోత్కూరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య): మండలంలోని అనాజీపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేసిన ఘటన ఆదివారం కలకలం రేపింది. గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద నిలిపి ఉంచిన రెండు ట్రాక్టర్ల బ్యాటరీలను దుండగులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. ఇందులో పంచాయతీకి చెందిన ఒక ట్రాక్టర్ కాగా, మరొకటి రైతు శాఖపురం మల్లేష్ చెందిన ట్రాక్టర్ల బ్యాటరీలు దొంగతనానికి గురయ్యాయి. సుమారు ఒకొక్క బ్యాటరీ విలువ 8000 చొప్పున ఉంటుందని బాధితులు తెలిపారు.ఒకే ప్రాంతంలో వరుసగా బ్యాటరీలు చోరీ కావడంతో గ్రామస్తులలో ఆందోళన నెలకొంది.రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, గ్రామంలో రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జాతీయ జనగణనలో ఓబీసీ గణనకై శంషాబాద్‌లో ఓబీసీ భారీ బహిరంగ సభ



ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 04, (వార్త వేదిక సూర్య)::


యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన సాధనకై శంషాబాద్ ప్రాంగణంలో నిర్వహించిన ఓబీసీ భారీ బహిరంగ సభకు ఆత్మకూరు మండల కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సారథ్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సభలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, సొసైటీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు ముద్దసాని సిద్దులు, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్ గౌడ్, విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షులు పైళ్ళ మహేష్ మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కంచనపల్లి గ్రామ నూతన అభివృద్ధి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



వలిగొండ, అక్టోబర్ 4 (వార్తా వేదిక సూర్య):

వలిగొండ మండల పరిధిలోని కంచనపల్లి గ్రామంలో గ్రామ ప్రజలు మరియు యువకుల ఆధ్వర్యంలో నూతన గ్రామ అభివృద్ధి కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా సర్వంచ్ రేసు బుచ్చి రెడ్డి, కొమిరెల్లి బాలకృష్ణా రెడ్డి, అధ్యక్షులు గా జక్క సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాక్షులుగా పెద్దిటి మధుసూదన్ రెడ్డి, పల్లపు నాగరాజు, ఎంపాల జాన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గా జక్క జంగారెడ్డి, సహాయ కార్యదర్శి గా వడ్లకొండ నర్సింహ్మ, కోశాధి కారిగా గంగారం రమేష్ లుగా ఎన్నుకోవడం జరిగింది,అధ్యక్షులు జక్క సుదాకర్ రెడ్డి స్వచ్ఛందంగా 5లక్షల రూపాయలు ప్రకటించారు.అలాగే మిగతా సభ్యుల బాలకృష్ణారెడ్డి రూ:100116,గంగారం రమేష్ రూ:100116,జక్క జంగారెడ్డి రూ:51116,పల్లపు నాగరాజు రూ:51116,పెద్దిటి మదు సుదన్ రెడ్డి రూ:51117 ప్రకటించినారు .ఈ కార్యక్రమంలో జక్క శంకర్ రెడ్డి,డేగల పాండరి, మోర వెంకట్ రెడ్డి,చెన్న కృష్ణా రెడ్డి,జక్క నర్సింహ్మ రెడ్డి, మహేందర్ రెడ్డి,పైళ్ల వెంకట్ రెడ్డి,పరశురాం,రాజి రెడ్డి,వెంకటేశం, నరేష్,యాదయ్య, సత్తయ్య,లిగస్వామి, మల్లేశం,రాజు,శివ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **Emailld:vaarthavedhikasurya2025@gmail.com**

ఆర్టీఏ కమిషనర్ ప్రత్యేక పూజలు

పాల్గొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

భువనగిరి, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గతంలో మొక్కుకున్న మొక్కు తీర్చుకునే కార్యక్రమంలో భాగంగా ఆర్టీఏ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి ప్రసిద్ధ ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దివ్య ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు.

మర్యాదపూర్వకంగా కలిసిన సర్వోత్తమ్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):



భువనగిరి పార్లమెంట్ సభ్యులు, పీసీసీ పబ్లిసిటీ, మీడియా కమిటీ చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డిని నల్లగొండ–ఖమ్మం–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచార నిర్వహణ, గ్రాడ్యుయేట్ ఓటర్లను సమన్వయం చేసుకోవడం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.

అబద్ధపు ప్రచారాలు
మానుకో పుట్ట మధు



మంథని, అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్య):

మంథని కూరగాయల మార్కెట్ లో మండల కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో కమాన్పూర్ మాజీ జెడ్పిటిసి పుట్ట మధు చేసినటువంటి వాక్యాలను ఖండిస్తూ ఆదివారం ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, సూరయ్యపల్లి గ్రామ సర్పంచ్ ఆర్ల నాగరాజు మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పైన అనుచిత వాక్యాలు చేస్తే సహించబోమని నువ్వు గత పది సంవత్సరాల కాలంలో ఎంత దోచుకున్నావో ప్రజలందరూ గమనించారు, నీకు తగిన బుద్ధి చెప్పారు అయినా కూడా మారకుండా ఇష్టారాజ్యంగా అబద్ధపు ప్రచారాలు చేసుకుంటూ పబ్బం కడుపుతున్నావు. అవగాహన లేని చిల్లర మాటలు, కమిషన్ రాజకీయాలు, ఇసుక దందాలు ఆయన చేసి ఇప్పుడు మంథని అభివృద్ధిపై, ప్రజలపై ఎంతో ప్రేమ ఉన్నట్లు విచక్షణ లేని మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. మాట్లాడే పద్ధతి మార్చుకోమని ఎన్నోసార్లు మర్యాదగా చెప్పామని, ఆయన పద్ధతిలో ఎలాంటి మార్పు రాకుండా ఎంతసేపు ఆయన రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా విమర్శలు చేయడం తప్పితే మంథని అభివృద్ధి, ప్రజలపై ఎలాంటి ప్రేమ అవగాహన లేదన్నారు. మంథని ప్రాంతాన్ని ప్రజలను విద్య, వైద్యం, ఉపాధి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నిత్యం కృషి చేస్తున్నారని అన్నారు. శ్రీధర్ బాబు, శ్రీనుబాబు లను ఏకవచనంతో సంబోధిస్తూ ఎంతసేపు వారి కుటుంబం పై అమర్యాదగా మాట్లాడడం తప్పితే పుట్ట మధుకు ఏ విధమైన రాజకీయ పరిణితి, అవగాహన లేదని అతని వాక్యాలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ హయంలో మంథని పాలకవర్గం ఏర్పాటు చుకున్నాం, కాంగ్రెస్ పార్టీ మా నాయకులు, కార్యకర్తల కృషితోని మా పాలకవర్గాన్ని ఏర్పరచుకున్నాం, మీ భార్య పుట్ట శైలజను నువ్వెందుకు పోటీలో నిలబెట్టలేదు, నువ్వు అధికారంలో ఉంటే నీ అధికారం అనుభవించడానికి మీ భార్యను చైర్మన్గా చేస్తావ్, ఇప్పుడు అధికారంలో మేము లేము ఎట్లాగో మేము ఓడిపోతాం అనే భయంతో మొన్న జరిగినటువంటి మున్సిపల్ ఎలక్షన్ లో నిలబట్టలేదు నీ రాజకీయ ఆలోచన అనేది ఏ విధంగా ఉన్నదో ఆలోచించుకోవాలి పుట్ట మధు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని విభాగల నాయకులు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసిన సర్వోత్తం రెడ్డి

ఆలేరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను వరంగల్–నల్లగొండ–ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు రాజకీయ, పార్టీ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి పార్టీనాయకులు,కార్యకర్తలుసమన్వయం తోపనిచేయాలని వారు పేర్కొన్నారు.

వేపచెట్టు నేలకూల్చివేత

అధికారుల తీరుపై స్థానికుల ఆవేదన

ఆలేరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):



ప్రకృతి ప్రసాదించిన నీరు, వృక్షాలు,జంతు జాతులను మానవ అవసరాల పేరుతో విచ క్షణారహిత ంగా ధ్వంసం చేయడం వల్లే ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణ సమస్యలు తీవ్రతరమవుతున్నాయని సామాజిక కవి పత్తిపాటి మంజుల పేర్కొన్నారు. కవులు, రచయితలు, నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రకృతి ప్రేమికులు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా పర్యావరణ పరిరక్షణపై నిర్లక్ష్యం చేయ డం ఆందోళనకరమన్నారు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్‌స్టేషన్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వెనుక వైపు, విద్యుత్‌శాఖ కార్యాలయానికి సమీపంలో ఉన్న పెద్ద వేపచెట్టును ఆదివారం ఉదయం నరికివేయడం స్థానికుల్లో ఆవేదన కలిగించింది. భవనాలు, ఇతర నిర్మాణాలు లేని ప్రాంతంలో పాదచారులకు నీడ, ఆశ్రయం కల్పిస్తూ ఎంతోకాలంగా ఉన్న వేపచెట్టును తొలగించడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ తీగలకు ఇబ్బంది కలుగుతున్న చెట్లను అవసరమైన మేరకు ట్రిమ్మింగ్ చేయాల్సిన చోట పూర్తిగా నరికివేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, బాధ్యులపై నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. “చెట్లను కాపాడటం అంటే మనిషి శ్వాసను కాపాడటమే అభివృద్ధి పేరుతో ప్రకృతిని ధ్వంసం చేయకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి శాఖ బాధ్యతగా వ్యవహరించాలి.

జిల్లా గిరిజన సర్పంచ్ ఫోరం నూతన కమిటీ ఎన్నిక

తండాల అభివృద్ధికి ప్రత్యేక ఎజెండా రూపకల్పన

జగిత్యాల, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):



తెలంగాణ గిరిజన సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా సదస్సు నిర్వహించి నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తండాల అభివృద్ధి, గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ఎజెండాను రూపొందించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గిరిజన సర్పంచ్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భూక్య సంతోష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతన జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. జగిత్యాల జిల్లా గిరిజన సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా గుగులావత్ రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగులోత్ వినోద్ నాయక్, ఉపాధ్యక్షులుగా భూక్య తిరుపతి నాయక్, ప్రధాన కార్యదర్శిగా భానోత్ రమేష్ నాయక్, పరచ శంకర్, కార్యదర్శులుగా మాలోత్ తిరుపతి, బోడ సాగర్, కోశాధికారిగా రామ్ చందర్, సుధాకర్, సభ్యులుగా గణేష్ నాయక్, అపోవత్ రాజు, సురేందర్ నాయక్ ఎన్నికయ్యారు. డాక్టర్ భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సర్పంచులు ఐక్యంగా పనిచేసి తండాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన గ్రామాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గిరిజన సర్పంచులు, గౌరవ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.15

కేసీఆర్ కోసమే ఎదురు చూస్తుండ్లు

యువకుల పాదయాత్ర అభినందనీయం
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావాలనే కోరుకుంటున్నారని, ఆయన కోసమే ఎదురుచూస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ మంథనికి చెందిన ముగ్గురు యువకులు మంథని బెన్నిపాల్, బూర్ల వెంకటేశ్, కొండ వెంకటేశ్‌లు ఎరవెల్లి వరకు పాదయాత్ర చేసి మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి తిరిగి మంథనికి వచ్చిన సందర్భంగా మంథనిలోని రాజగృహాలో వారిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు యువకులు చేపట్టిన 200 కిలోమీటర్ల పాదయాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకునేందుకు ఎరవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారని తెలిపారు. పాదయాత్ర సందర్భంగా దారిపొడవునా యువకులను కలిసిన అనేకమంది సామాన్య ప్రజలు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆశీర్వాదం పొందడం ఎంతో సంతోషకరమన్నారు. ఎరవెల్లిలో కేసీఆర్ స్వయంగా వారితో మాట్లాడి భోజనం పెట్టించి, తన వాహనంలోనే వారిని మంథనికి పంపించడం పట్ల ముగ్గురు యువకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. తెలంగాణ మట్టిలో పుట్టిన ప్రతి ఒక్కరూ కేసీఆర్ తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారని, అన్ని వర్గాల్లోనూ అదే భావన కనిపిస్తోందని అన్నారు. కేసీఆర్‌ను కలవడం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నంత ఆనందంగా భావిస్తున్నామని తెలిపారు. ముగ్గురు యువకులు 200 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఇచ్చిన సందేశం రాష్ట్ర ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. వారి కోరిక నెరవేరాలని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న వారి ఆకాంక్ష ఫలించాలని కోరుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

యూనియన్ ఎన్నికల ప్రచారం

మంథని, అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్య):

మంథని డిపోలో యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంథని డిపోకు ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఐక్య కూటమి రాష్ట్ర నాయకులు ఈదురు వెంకన్న, రాష్ట్రనాయకులు ఎంపీ రెడ్డి, కేఎస్ రెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకులు పాల్, రీజినల్ నాయకులు ఏవి ఆర్ రెడ్డి, కొమ్మ కొమురయ్య యాదవ్,మంథని డిపో నాయకులు కేకే రెడ్డి ,గంధం రమేష్ ,ఐలయ్య ,సదానందం, సదయ్య ,జనార్దన్ , శేఖర్,విజేందర్, మల్లయ్య, వెంకట స్వామి , పెద్దపల్లి రమేష్ , శ్రీనివాస్, ఎల్ల రమేష్, గోపి, కుమార్, తిరుపత, శ్రీనివాస్,రమేష్,నాగేంర్, మునీర్, మహిళా నాయకులు బేగం, సుమలత ,మంజుల, రాజేశ్వరి, కోమల, లత,స్వరూప,సౌజన్య పాల్గొన్నారు

పులిగిల్ల బాలయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ చామల



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య): టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిగిల్ల బాలయ్య తండ్రి పులిగిల్ల యాదగిరి ఇటీవల మృతి చెందగా, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లి బాలయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా యాదగిరి మృతికి సంతాపం వ్యక్తం చేసిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి.. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారికి అండగా ఉంటామని తెలిపారు. ఎంపీ వెంట భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పీసీసీ డెలిగేట్ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, మాజీ కౌన్సిలర్ పడిగల ప్రదీప్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అతహర్, ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ రాంపల్లి కృష్ణ, ఉపసర్పంచ్ అందే మల్లేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు స్వామి, గంగసాని పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని నాగేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండ అబ్బయ్య, రాగుల రవీందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగర్ కర్నూల్ అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్య):



బిజినపల్లి మండలంలో బస్టాండ్ ప్రాంగణంలో శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల వచ్చి సద్వినియోగం చేసుకున్నారు వారి నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో వైద్య నిపుణులు ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, మోకాళ్ళ నొప్పులు, గ్యాస్ ప్రాబ్లమ్స్ తదితర పరీక్షలు చేసి, వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హేమంత్ గౌడ్, మార్కెటింగ్ పిఆర్ఓ కర్నే శివ, సైదులు,ఈ రాజేష్, సిబ్బంది లక్షి , శివలీల, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగాలకు చిరస్థాయిగా గుర్తింపు ఇవ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ఆలేరు, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య త్యాగాలను చిరస్థాయిగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఆదివారం ముఖ్యమంత్రిని కలిసి దొడ్డి కొమురయ్య స్మృతిని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిపేలా పలు ముఖ్యమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వరంగల్‌లోని మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని బీర్ల ఐలయ్య విజ్ఞప్తి చేశారు. అలాగే హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణలో కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి కురుమ సామాజిక వర్గం అభివృద్ధి, సంక్షేమానికి మరింత ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని, ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని బీర్ల ఐలయ్య కోరారు.

అక్రమ మద్యం పట్టుకున్న పోలీసులు

మంథని, అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్య):



మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామంలో మద్యం విక్రయాలను నిషేధిస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని కొందరు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ సభ్యులు పోలీసుల సహకారంతో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని పేర్కొన్న ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

- ముఖ్యమంత్రి అచేతన స్థితిలో ఉన్నారు.. వరుణయాగం చేసి ప్రజలను వారి ఖర్మకు వదిలేశారు
- నవంబర్ వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- కరువు, రైతు సమస్యలపై ప్రత్యేక కేబినెట్ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్



రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కరువును ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కరువు పరిస్థితులపై వెంటనే ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నవంబర్ వరకు రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాల్లో కరువు తాండవిస్తోందని, కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు 20 మీటర్ల లోతుకు పడిపోయాయని తెలిపారు. పంటలు ఎండిపోవడంతో రైతులు వాటిని దహనం చేసుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. జులైలో సాధారణం కంటే ఒక శాతం, ఆగస్టులో 38 శాతం, సెప్టెంబరులో 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని శాస్త్రవేత్తలు ఆరు నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖలతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ రూపొందించాల్సి ఉండేదని అన్నారు. అందుకు భిన్నంగా నాగార్జునసాగర్‌లో వరుణయాగం చేసి, వర్షాలు కురిస్తే కురిసినట్లు, లేకుంటే ప్రజల ఖర్మ అన్నట్లుగా వదిలేశారని విమర్శించారు. కరువు పరిస్థితులపై కనీసం సమీక్ష కూడా నిర్వహించని అచేతన స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

హైదరాబాద్ అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య)

నవంబర్ వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

రాష్ట్రంలో ప్రస్తుతం కోటి 20 లక్షల ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నాయని, వాటిని కాపాడాలంటే నవంబర్ వరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కవిత డిమాండ్ చేశారు. బోర్ల ద్వారా పంటలకు నీరందించేందుకు విద్యుత్ అత్యవసరమని, కానీ అనేక గ్రామాల్లో ఆరు నుంచి ఏడు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ ఏడు గంటలు విద్యుత్ రావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యుత్‌ను అదుక్కుంటుందో, కొనుగోలు చేస్తుందో తమకు సంబంధం లేదని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం కరువు మండలాలను ప్రకటిస్తారని ఆశించామని, అయితే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించాయని, తెలంగాణలోనూ వెంటనే గుర్తించాలని కోరారు. కరువు మండలాల ప్రకటనతో కేంద్ర బృందాల పరిశీలన, సహాయం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను గుర్తించడంలోనే ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

దక్షిణాది రాష్ట్రాలను ఆదుకోవాలి

తీవ్ర కరువుతో అల్లాడుతున్న తెలంగాణతో పాటు మహారాష్ట్ర సహా దక్షిణాది రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీకి కవిత విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలో కేంద్రం సహాయం అందించకపోతే ప్రజలు క్షమించరని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో అదనపు సాయం అందలేదని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల కారణంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతాయని గతంలోనే హెచ్చరించామని కవిత తెలిపారు. సింగరేణి విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తోందని, అప్పుడే బకాయిలు చెల్లించి ఉంటే ప్రస్తుత పరిస్థితి తలెత్తేది కాదని వ్యాఖ్యానించారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం వల్ల కూరగాయలు సహా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే 60 శాతం మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

తాగునీటి సమస్యపైనా ఆందోళన

కరువు ప్రభావం వ్యవసాయంతోనే ఆగిపోకుండా తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరువయ్యాయని, కృష్ణా జలాలను కాపాడుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులపై ముందుగానే దృష్టి సారించి ఉంటే భూగర్భ జలాల పరిస్థితి మెరుగ్గా ఉండేదని, కల్వకుర్తి ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. మూడేళ్లలో ఈ పనులను పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. ఒకవైపు కర్ణాటకను అడిగి నీళ్లు తెస్తున్నామని చెబుతూ, మరోవైపు చంద్రబాబుకు నీటిని అందిస్తున్నారని విమర్శించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఎండలు తీవ్రంగా పెరిగే అవకాశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కరువు సమస్య ఒక్క శాఖకు సంబంధించినది కాదని, మొత్తం ప్రభుత్వ వైఫల్యమని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు గ్రామాల్లో పర్యటిస్తారని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రులు, ఉపాధ్యాయుల సమస్యలపైనా విమర్శలు

రైతుల సమస్యలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితులపై తమ పార్టీ నాయకులు 'ఆపరేషన్ బ్లూ కోడ్' పేరుతో పరిశీలన చేపడుతున్నారని కవిత తెలిపారు. భూపాలపల్లి ఆసుపత్రిలో పైకప్పు కూలిన ఘటనను తమ పార్టీనే వెలుగులోకి తెచ్చిందని, రిమ్స్ ఘటనపై పోరాటం చేసిన తర్వాతే ప్రభుత్వం రూ.11 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. భూపాలపల్లి ఘటనకు సంబంధించిన వీడియో తీసిన పార్టీ కార్యకర్తను పోలీసులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాడేవారిని బెదిరించకుండా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. జీవో 317 బాధితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా పరిష్కరించగల సమస్యను మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంచారని అన్నారు. ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులను గాంధీ జయంతి రోజున పోలీసులు ఈడ్చుకెళ్లి లాఠీచార్జి చేయడం సరికాదని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలను పాటిస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం అదే రోజున ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. జీవో317బాధితుల్లో పోలీసు సిబ్బంది కూడా ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి సైతం తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు.

ఈవీఎంలకు బదులు పేపర్ బ్యాలెట్ విధానం రావాలి

దేశంలో ఎన్నికలు ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్ విధానంలో నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. ఈవీఎంలపై అనుమానాలు ఉన్నందున ఎన్నికల ప్రక్రియలో శాశ్వత మార్పులు తీసుకురావాలని, తాత్కాలిక పరిష్కారాలతో సమస్యలు పరిష్కారం కావని అన్నారు. పేపర్ బ్యాలెట్ విధానంతోనే పారదర్శక ఎన్నికలకు అవకాశం ఉంటుందని తమ పార్టీ భావిస్తోందని పేర్కొన్నారు. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోనూ పేపర్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. దేశంలో తిరిగి పేపర్ బ్యాలెట్ విధానం అమలుకు తమ పార్టీ తరపున ఢిల్లీ వరకు వెళ్లి పోరాటం చేస్తామని వెల్లడించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు ఇంకా సమయం పట్టవచ్చని భావిస్తున్నామని, ఖైరతాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా తమ పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. ఎన్నికలను పార్టీ విధానాలు, అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశంగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో పాఠశాలల్లో మరుగుదొడ్లు, కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించేందుకు కూడా పార్టీ బృందాలను నియమిస్తామని కవిత వెల్లడించారు.

కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ని పదవి నుండి తొలగించాలి

- SIR ప్రక్రియ రద్దు చేయాలి
- తొలగించిన న్యాయమైన ఓట్లు పునరుద్ధరించాలి
- అక్టోబర్ 6న కలెక్టరేట్ ముందు ధర్నా జయప్రదం చేయండి
- ఇండియా కూటమి పిలుపు



భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే పదవి నుండి తొలగించాలని అక్టోబర్ 6న కలెక్టర్ ముందు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సిపిఐ జిల్లా కార్యదర్శి –యానాల దామోదర్ రెడ్డి –సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు మామిడాల బిక్షపతి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు...ఆదివారం భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవన్ లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ఆ ప్రజాస్వామిక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సీఈసీ వెంటనే రాజీనామా చేయాలని, అన్యాయంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని ఆదివారం సీపీఎం ఆఫీస్ లో వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ ఏటా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతున్నప్పుడు ప్రత్యేకంగా సార్ ప్రక్రియను ఎందుకు చేపట్టాల్సి వచ్చిందని ప్రశ్నించారు.సజీవంగా ఉన్న వ్యక్తులు కూడా తమ ఓటు హక్కును మళ్ళీ నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు, ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఉపాధి కోసం వెళ్ళినంత మాత్రాన వారి ఓట్లను తొలగించడం సరికాదు అన్నారు. అక్రమ చొరబాటుదారులు ఉన్నారని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి స్పష్టమైన ఆధారాలు బహిర్గతం చేయలేదన్నారు. ఈ విషయంలో కేంద్ర హోంశాఖ ఏం చేస్తుందో స్పష్టం చేయాలన్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటర్లకు మారిస్తే మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గకూడదని, కానీ 13 కోట్ల ఓట్లు ఎలా తగ్గాయని ప్రశ్నించారు. పేదలు, యువకులు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, వలస జీవులు, మహిళా ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారు విమర్శించారు. ఓటు హక్కును కొందరికి పరిమితం చేసే కుట్రకు పాల్పడి రాజ్యాంగ వ్యవస్థ ను అపహాస్యం చేసిన ప్రధానమంత్రి మోడీ హోం శాఖ మంత్రి అమిత్ షాలకు పాలనా చేసే హక్కు లేదని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు కమిషన్ ఉంటే వారిని కాదని జ్ఞానేశ్వర్ కుమార్ ఓట్ల తొలగింపు ఫారం 6 లో మార్పులు ఏక పక్షంగా ఎలా చేస్తారని ప్రశ్నించారు, ఇప్పటికే 13 కోట్ల కోట్లనే తొలగించారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ తనకు అనుకూలంగా మార్చుకోవాలని బిజెపి కుట్రలు పన్నుతుందని విమర్శించారు. తొలగించిన ఓటర్లు అర్హులైన వారికి తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు సార్ ను అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో కూడా అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని అన్నారు, తెలంగాణలో తొలగించిన ఓట్లను వెంటనే చేర్చాలని వాళ్ళు డిమాండ్ చేశారు , అత్యంత దుర్మార్గమైన ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించి. ప్రధానమంత్రి మోడీ ఏది చెప్తే అదే చేయాలని ఈసీ ఉందని ఎద్దేవ చేశారు, ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. మోడీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యలు చేసిన, అలాంటి వారిని గుర్తించి ఓటర్ లిస్ట్ నుంచి వారి పేర్లు తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు, భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుంచి తొలగించాలని అక్టోబర్ 6న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నాకు ప్రజలు ప్రజాస్వామ్యవాదులు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

గడల శ్రీనివాసరావు

లక్ష రూపాయలు జనసేన పార్టీకి విరాళం అందించిన ఆముదాల పరమేష్

చౌటుప్పల్, అక్టోబర్ 4 (వార్త వేదిక సూర్య)

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నల్లగొండ ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక భాగంలో ఆదివారం చౌటుప్పల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బిడ్డల నుంచి పొందిన స్ఫూర్తితోనే జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ సారథ్యంలో జనసేన పార్టీ వచ్చిందన్నారు. నీళ్లు నిధులు నియామకాల కోసం 1200 మంది తెలంగాణ యువత బలిదానంతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లపాటు బారాస అధికారంలో ఉన్నదని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఆ పార్టీ ఫామ్ హౌస్ కే పరిమితమైందని తెలిపారు. యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ యువతకు భృతి, విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2500, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లయిన కనీసం 20 శాతం హామీలు కూడా అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలు కామారెడ్డి డిక్లరేషన్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎవరిని మోసం చేసేందుకు హామీలు ఇచ్చారు ఎందుకు అమలు చేయడం లేదు అని నిలదీశారు. ప్రజల్ని గొర్రెలు అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. బారాస ప్రభుత్వం పదేళ్ల అరణ్యవాసం, కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల అజ్ఞాతవాసం పూర్తయ్యాయని అందుకే జనసేన రంగంలోకి దిగిందని, గలమెత్తి ప్రశ్నిస్తుందని తెలిపారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తేనే తెలంగాణలో సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జనసేన పార్టీకి సెమీ ఫైనల్స్ లాంటివని చెప్పారు ఈ ఎన్నికల్లో జనసేన ను ఎమ్మెల్సీగా గెలిపించాలని పట్టభద్రులను కోరారు. పవన్ కళ్యాణ్ వస్తున్నారని, ఆయన వస్తే ప్రళయం వస్తుందని తెలిపారు. ఉద్యమాల పురిటి గడ్డైన నల్గొండ జిల్లా నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల యుద్ధం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. జ్యోతిని వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ సభ్యత్వాన్ని అత్యధిక సంఖ్యలో చేర్పించిన వివిధ నియోజకవర్గాల నాయకులకు ఈ సమావేశ వేదికపై ఘనంగా సన్మానించారు.



జనసేన పార్టీకి రూ. లక్ష విరాళం ఇచ్చిన ఆముదాల పరమేశ్


జనసేన పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్, అభ్యర్థి గడల శ్రీనివాస్ ఎన్నికల ప్రచార నిమిత్తం కొరకు ఒక లక్ష రూపాయల చెక్కు విరాళాన్ని ఈ సభా వేదికపై ఆయనకు అందజేశారు. ఒక ఆశయం లక్ష్యం సిద్ధాంతం కోసం జనసేన పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ కు పట్టభద్రులు అందగా నిలవాలని ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్ము రెడ్డి ప్రేమ్ కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్,శర్మ, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ ,శివ కార్తీక్ , లక్ష్మణ్ గౌడ్, పీక ప్రవీణ్ , మామిడాల రమేశ్,శ్రీకాంత్,లింగస్వామి, బద్రి రాజు,పాండు, ప్రవీణ్ జన సైనికులు, పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హెల్త్ కార్డుల పునరుద్ధరణ కోసం

పోస్ట్ కార్డు ఉద్యమం

TUWJ (H-143) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి బహిరంగ లేఖలు

సూర్యాపేట, సెప్టెంబర్ వార్త (వేదిక సూర్యా)



తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హెల్త్ కార్డుల పునరుద్ధరణ కోసం TUWJ (H-143) ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం గతంలో అమలు చేసిన హెల్త్ కార్డుల పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (H-143) రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి బహిరంగ లేఖలు రాసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

సూర్యాపేటలో రేపు పోస్ట్ కార్డు ఉద్యమం:

సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం, తేదీ 05-10-2026న వాణిజ్య భవన్ సెంటర్ లో ఈ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు TUWJ జిల్లా అధ్యక్షులు వజ్జె వీరయ్య తెలిపారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు చెందిన జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి, ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డుల ద్వారా తమ నిరసనను, తమ డిమాండ్ ను తెలియజేయాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల హక్కుల కోసం ఉద్యమిద్దాం:

జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేసిన జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్ట్ హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కావున జిల్లాలోని జర్నలిస్ట్ మిత్రులందరూ ఈ పోస్ట్ కార్డు ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని TUWJ (H-143) నాయకులు కోరారు.

దసరా పండుగకు ప్రత్యేక బస్సు సర్వీసులు

సూర్యాపేట ,అక్టోబర్ 04 (వార్త వేదిక సూర్యాపేట)

దసరా పండుగను (విజయదశమి) పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సూర్యాపేట డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ఊటుకూరి సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రత్యేక సర్వీసులు ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి.

పూర్తి వివరాలు: హైదరాబాద్ (దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్) ↔ సూర్యాపేట. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి సూర్యాపేటకు వచ్చే ప్రయాణికులు సూర్యాపేట నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

శ్రీశైలం సర్వీస్: సూర్యాపేట నుంచి బయలుదేరే శ్రీశైలం బస్సుకు కూడా ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉందని పేర్కొన్నారు.ప్రయాణికులు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను వినియోగించుకుని తమ ప్రయాణాన్ని సురక్షితంగా, సుఖవంతంగా కొనసాగించాలని కోరుకుంటున్నట్లు డిపో మేనేజర్ స్పష్టం చేశారు.








05th October 2026
HAPPY BIRTHDAY
ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన నాయకత్వం... ప్రజాసేవనే పరమావధిగా సాగిన మీ ప్రయాణం...
చౌటుప్పల్ ప్రగతికి మీ కృషి ఓ చిరునామా... ఆపన్నులకు అండగా నిలిచే మీ మనసు ఓ అభయం...
చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్
శ్రీమతి మొగుదాల పావని రమేష్ గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
శివ గ్రాఫిక్స్
చౌటుప్పల - 98480 72710